సాక్షి అనంతపురం

శనివారం । 21 । అక్టోబర్ । 2023

I



టమాట కిలో రూ.10

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



జగన్‌తోనే వాల్మీకులకు గుర్తింపు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే వాల్మీకులకు తగిన గుర్తింపు లభించిందని మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు.

IIలో

గరిష్టం/కనిష్టం

37.4°/22.7°

జిల్లా అంతటా శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం తగ్గింది. ఉక్కపోత నెలకొంది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 4 నుంచి 6 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

సమస్యల పరిష్కారానికే అదాలత్



వినియోగదారుల సమస్యలు వింటున్న అదాలత్ సభ్యులు

అనంతపురం టౌన్: వినియోగదారుల సమస్యల పరిష్కారానికే విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీడీసీఎల్ చైర్మన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి అన్నారు. శుక్రవారం విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయంలో విద్యుత్ అదాలత్ నిర్వహించారు. వినియోగదారుల సమస్యలపై 20 అర్జీలు స్వీకరించారు. ఎస్పీడీసీఎల్ చైర్మన్ మాట్లాడుతూ అదాలత్‌లో అందిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే విద్యుత్ సంస్థ వినియోగదారుల కోసం 1912 టోల్ ఫ్రీ నంబర్‌ను సైతం అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. సమస్యపై ఫోన్ చేసిన వెంటనే విద్యుత్ సిబ్బంది వారి ఇంటి వద్దకే వచ్చి సమస్యలకు పరిష్కార మార్గం చూపుతున్నారన్నారు. అధికారులు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో విద్యుత్ అదాలత్ సభ్యులు రామ్మోహనరావు, ఈశ్వరమ్మ, విద్యుత్ శాఖ ఎస్ఈ సురేంద్ర, ఈఈ జేవీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపాలి



ఉద్యోగుల సమస్యలు వింటున్న డీఆర్ఓ గాయత్రిదేవి

అనంతపురం అర్బన్: ఉద్యోగుల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని డీఆర్ఓ గాయత్రీదేవి జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ఉద్యోగుల ప్రత్యేక స్పందన కార్యక్రమంలో ఉద్యోగుల నుంచి డీఆర్ఓ, డిప్యూటీ కలెక్టర్ ఆనంద్ అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 19 వినతులు అందాయి. డీఆర్ఓ మాటాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఆయా శాఖల అధికారులు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నిర్దేశించిన గడువులోపు అర్జీలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి మధుసూదన్‌రావు, బీసీ సంక్షేమ శాఖాధికారి ఖుష్బూ కొఠారి, స్పందన ఇన్‌చార్జ్ వాణిశ్రీ, అధికారులు పాల్గొన్నారు.

అక్రమాల 'వరద'

- వరదాపురం సూరి స్టోన్ క్రషర్ యూనిట్‌లో భారీ అక్రమాలు
- గనుల శాఖ అధికారుల తనిఖీలో వెల్లడి
- నోటీసులకు స్పందించని యాజమాన్యం
- రూ.1.60 కోట్ల జరిమానా విధించిన అధికారులు

అనంతపురం టౌన్: ధర్మవరం మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ (వరదాపురం సూరి)కు చెందిన స్టోన్ క్రషర్ యూనిట్ నిర్వహణలో భారీఎత్తున అక్రమాలకు పాల్పడ్డారు. ఈ విషయం భూగర్భ గనుల శాఖ అధికారుల ఆకస్మిక తనిఖీల్లో బట్టబయలైంది. దీంతో ఏకంగా రూ.1.60 కోట్ల జరిమానా విధించారు.

వరదాపురం సూరికి చెందిన నితిన్‌సాయి కన్‌స్ట్రక్షన్ సంస్థ పేరిట అనంతపురం రూరల్ మండలం క్రిష్ణంరెడ్డిపల్లి సమీపంలో సర్వేనంబర్ 40-4, 53లో స్టోన్ క్రషర్ యూనిట్ నిర్వహిస్తున్నారు. పక్కనే ఉన్న క్వారీ నుంచి రోడ్డు మెటల్‌ను క్రషర్‌లోకి తరలించి 40 ఎంఎం, 20 ఎంఎం, 12 ఎంఎం, 6 ఎంఎం..ఇలా వివిధ రకాల మెటల్(కంకర)తో పాటు డస్ట్‌గా మార్చి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అయితే క్వారీలో నుంచి తరలించిన స్టాక్‌కు.. క్రషర్‌లోని స్టాక్‌కు భారీ వ్యత్యాసం ఉన్న విషయం ఇటీవల గనులశాఖ అధికారుల ఆకస్మిక తనిఖీలో వెల్లడైంది.

24 వేల క్యూబిక్ మీటర్లకు లెక్కలేదు!

చియ్యేడు గ్రామ సమీపంలోని క్వారీ నుంచి తరలించిన రోడ్డు మెటల్.. క్రషర్‌లో ఉన్న రోడ్డు మెటల్ స్టాక్ వివరాల్లో భారీ వ్యత్యాసాన్ని గుర్తించిన అధికారులు క్వారీలో కొలతలు తీశారు. 24,370 క్యూబిక్ మీటర్లకు సంబంధించిన రోడ్డు మెటల్ వివరాలను క్రషర్ యూనిట్ నిర్వాహకులు రికార్డుల్లో నమోదు చేయకుండా.. ఎలాంటి సీనరేజీ చెల్లించకుండానే అక్రమంగా తరలించి సొమ్ము చేసుకున్నట్లు గుర్తించారు. ఆ మెటల్ ఎక్కడికి తరలించారో తెలపాలంటూ నితిన్‌సాయి కన్‌స్ట్రక్షన్ యాజమాన్యానికి అధికారులు నోటీసులు జారీ చేశారు. వీటిపై యాజమాన్యం ఏమాత్రమూ స్పందించలేదు. దీంతో అధికారులు అక్రమంగా తరలించిన రోడ్డు మెటల్‌కు ఎంత మొత్తం అవుతుందో లెక్కగట్టి ఐదు రెట్లు జరిమానా విధించారు. మొత్తం రూ.1.60 కోట్ల జరిమానా సకాలంలో ప్రభుత్వానికి చెల్లించాలంటూ నోటీసులు జారీ చేశారు. లేని పక్షంలో క్రషర్ యూనిట్‌ను సీజ్ చేస్తామని నోటీసుల్లో పేర్కొన్నారు.



స్టోన్ క్రషర్ యూనిట్

భారీ స్థాయిలో అవకతవకలు జరిగాయి

నితిన్‌సాయి కన్‌స్ట్రక్షన్‌కు చెందిన స్టోన్ క్రషర్ యూనిట్‌లో రోడ్డు మెటల్‌కు సంబంధించి భారీ స్థాయిలో అవకతవకలు జరిగాయి. క్వారీ నుంచి వచ్చిన మెటల్‌కు, క్రషర్‌లో ఉన్న స్టాక్‌కు మధ్య భారీ వ్యత్యాసాన్ని గుర్తించి యాజమాన్యానికి నోటీసులు జారీ చేసినా పట్టించుకోలేదు. దీంతో రూ.1.60 కోట్ల జరిమానా సకాలంలో చెల్లించాలని డిమాండ్ నోటీసులు పంపాం. క్వారీల్లో అక్రమ తవ్వకాలు, క్రషింగ్ చేపడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్న వారిని ఉపేక్షించం. ఆకస్మిక తనిఖీలు చేపట్టి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– నాగయ్య, గనుల శాఖ డీడీ, అనంతపురం

రైతులకు అండగా నిలవాలి

- అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి

అనంతపురం అర్బన్: 'జిల్లాలో తీవ్ర వర్షాభావంతో కరువు పరిస్థితి నెలకొంది. ఈ తరుణంలో రైతులకు అండగా నిలవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది.. ప్రతి అంశంలోనూ రైతులకు మేలు చేయాలనే లక్ష్యంగా నిర్ణయాలు, చర్యలు ఉండాలి' అని జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ టి.రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో చైర్మన్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ పాల్గొన్నారు. చైర్మన్ మాట్లాడుతూ వర్షాభావంతో ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు చేతికి రాలేదని, దీంతో రైతు ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్నాడన్నారు. వర్షాలు వస్తే రైతులకు పప్పుశనగ పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. రబీ సీజన్‌లో ఈ క్రాప్ బుకింగ్ నవంబర్ నుంచి ప్రారంభించాలన్నారు.

7 గంటల విద్యుత్ ఇవ్వాలి..

వర్షాభావంతో రైతులకు పగటి పూట 9 గంటల పాటు విద్యుత్ ఇవ్వలేని పరిస్థితి ఉందని అగ్రిఅడ్వైజరీ బోర్డు చైర్మన్ అన్నారు. కనీసం 7 గంటల నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలన్నారు. పగలు 5 గంటలు, రాత్రి 2 గంటలు విద్యుత్ సరఫరా చేయాలన్నారు. దరఖాస్తు చేసుకున్న రైతులకు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర సామగ్రి ఒకేసారి ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి లైవ్ స్టాక్ మిషన్ పథకం జిల్లాకు అత్యంత అవసరం ఉందన్నారు. అర్హత కలిగిన వారికి రుణాలు మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. సాగునీటి ప్రాజెక్టుల్లో నీళ్లు లేవని, వర్షాలు ఎప్పుడు కురుస్తాయో తెలియని పరిస్థితుల్లో రైతులక అన్ని విధాల అండగా నిలిచి అధికార యంత్రాగం అవసరమైన సహకారం అందించాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, చిత్రంలో జేసీ కేతన్‌గార్గ్

ప్రతిపాదనలు పంపించాలి..

రబీ సీజన్‌లో రైతులకు పంపిణీ చేసేందుకు అవసరమైన విత్తనాలు అందించేందుకు ప్రతిపాదనలు పంపించాలని జేసీ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. వర్షాలు వస్తే రైతులకు పంపిణీ చేసేలా పప్పుశనగ విత్తనాలను అందుబాటులో ఉంచాలన్నారు. మండల స్థాయిలో పత్తిపంట కొనుగోలు చేసేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు అధికారులు బాధ్యతగా విత్తన పంపిణీ చేయాలన్నారు. ప్రొగ్రెస్సివ్ రైతులు సుబ్బారెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, రామరంగారెడ్డి పలు సూచనలు చేశారు. సమావేశంలో వ్యవసాయశాఖ జేడీ ఉమా మహేశ్వరమ్మ, పశసంవర్ధక శాఖ జేడీ సుబ్రమణ్యం, ఉద్యానశాఖ డీడీ రఘునాథరెడ్డి, ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్‌ఖాన్, జిల్లా సిరికల్చర్ అధికారి ఆంజనేయులు, ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త సహదేవరెడ్డి, నాబార్డు ఏజీఎం అనురాధ, వివిధ శాఖల అధికారులు, ప్రొగ్రెసివ్ రైతులు, సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.

నిరాశ పరిచిన 'నైరుతి'

అనంతపురం అగ్రికల్చర్: నైరుతి రుతుపవనాలు ఈసారి నిరాశపరిచాయి. ఖరీఫ్ సాగుకు ఊరటనిచ్చే ఈ రుతుపవనాలు ఆలస్యంగా జిల్లాను తాకినా అనుకున్న స్థాయిలో వర్షాలు కురవలేదు. నాలుగేళ్లుగా కరువుతీరేలా కుండపోత కురిపించిన వరుణుడు ఈసారి కాస్తంత విరామం తీసుకున్నాడు. తేలికపాటి వర్షాలతో సరిపెట్టడంతో ఖరీఫ్ సాగు మందకొడిగా సాగింది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాధారణంగా 319.6 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 22.6 శాతం తక్కువగా 247.4 మి.మీ నమోదైంది. దీంతో ఖరీఫ్ పంటలు 2.70 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో మాత్రమే సాగులోకి వచ్చాయి. నైరుతి రుతుపవనాలు ఈ నెల 19న నిష్క్రమించినట్లు వాతావరణశాఖ ప్రకటించింది.

త్వరలో ఈశాన్య రుతుపవనాల రాక..

అక్టోబర్ నుంచి ప్రారంభమైన రబీకి సంబంధించి ఈశాన్య రుతుపవనాలు రెండు మూడు రోజుల్లో ప్రవేశించే అవకాశం ఉందని వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలిపారు. అలాగే ఈ నెల 23న అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నందున నెలాఖరులో వర్షాలు కురిసే పరిస్థితి ఉందని చెబుతున్నారు.

వైద్య సేవలు అద్భుతం

- జగనన్న ఆరోగ్య సురక్షపై ప్రజల అభిమతం



కంబదూరు మండలం తిమ్మాపురం మెడికల్ క్యాంపులో వైద్యమందిస్తున్న డాక్టర్

అనంతపురం మెడికల్: జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపుల్లో స్పెషలిస్టు డాక్టర్లతో అందిస్తున్న సేవలు అద్భుతమని ప్రజలు కొనియాడుతున్నారు. అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించి, అవసరమైన వారికి మెరుగైన వైద్యం కోసం సిఫార్సులు చేయడం పేదల పాలిట వరమని తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లాలోని 23 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో 'ఆరోగ్య సురక్ష' వైద్య శిబిరాలు జరిగాయి. 8,843 మంది ఓపీ వైద్య సేవలు పొందారు. స్పెషలిస్టు వైద్యులు, మెడికల్ ఆఫీసర్లు పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. వయసు మీద పడి వివిధ రకాల రుగ్మతలు తెలియజేసిన వారికి బీపీ, షుగర్, తదితర వైద్య పరీక్షలను ల్యాబ్ టెక్నీషియన్లు చేశారు. 385 మందిని మెరుగైన వైద్యం కోసం జిల్లా, నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. 1,621 మందికి ఆప్తోమెట్రీలు కంటి పరీక్షలు నిర్వహించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి ఇటుకలపల్లిలో జరిగిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. డీఎంహెచ్ఓ వెంట డాక్టర్ మనోజ్, తదితరులు ఉన్నారు.

నేడు 22 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు

జిల్లాలో శనివారం 22 ప్రాంతాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు.

విశిష్ట సేవలకు ప్రతిష్టాత్మక పురస్కారం

- ఇద్దరికి 'వైఎస్సార్ జీవిత సాఫల్య' అవార్డులు
- వ్యవసాయంలో వైవీ మల్లారెడ్డి.. జానపదంలో చిగిచెర్ల కృష్ణారెడ్డి

అనంతపురం / కల్చరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించే వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారాలకు ఉమ్మడి అనంతపురం జిల్లానుంచి ఇద్దరు ప్రముఖులు ఎంపికయ్యారు. పర్యావరణ హితమే అభిమతంగా వ్యవసాయ రంగంలో సేవలందిస్తున్న వైవీ మల్లారెడ్డి, కళలు-సంస్కృతి విభాగంలో జానపద కళల ప్రాచుర్యానికి విశేష కృషి చేస్తున్న చిగిచెర్ల కృష్ణారెడ్డిని పురస్కారాలు వరించాయి. వీరు నవంబరు ఒకటో తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారంతో పాటు రూ.10 లక్షల నగదు, ప్రశంసా పత్రం అందుకోనున్నారు.

పర్యావరణ హితం.. మల్లారెడ్డి అభిమతం

శ్రీ సత్యసాయి జిల్లా గాండ్లపెంట మండలం నీరుకుంట్లపల్లికి చెందిన డాక్టర్ వైవీ మల్లారెడ్డి ఇంగ్లండ్‌లో ఎంబీఏ పూర్తి చేశారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం మేనేజ్‌మెంట్ విభాగంలో పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. 42 సంవత్సరాల కాలంలో విశేషమైన సేవా కార్యక్రమాలు చేపట్టారు. రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డీటీ) తరహాలోనే స్వయంప్రతిపత్తి గల యాక్షన్ ఫెటర్నా ఎకాలజీ సెంటర్ మల్లారెడ్డి ఆధ్వర్యంలోనే నడుస్తోంది. ఆర్డీటీతో పాటు ఈ ఎకాలజీ సెంటర్‌ను సైతం దివంగత ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ ప్రారంభించారు. గత 15 సంవత్సరాల నుంచి డాక్టర్ వైవీ మల్లారెడ్డి డైరెక్టర్‌గా ఎకాలజీ కేంద్రం దిగ్విజయంగా నిర్వహిస్తున్నారు. అనంతపురం జిల్లాలో 235 గ్రామాల్లో మొత్తం 60 వేల మంది రైతులకు, భూమి లేని నిరుపేదలకు, ఇతరులకు దోహదపడే కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. దేశంలోనే రెండో దుర్భిక్ష ప్రాంతమైన అనంతపురం జిల్లాలో కరువు నివారణ, పునరుజ్జీవం, వర్షాధార వ్యవసాయాన్ని బలోపేతం చేసే దిశగా వాటర్‌షెడ్‌ల నిర్మాణం, వాతావరణంలో మార్పులు తీసుకువచ్చేందుకు కృషి చేయడం, గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధి పెంపొందించే దిశగా ఎకాలజీ సెంటర్ విశేష కృషి చేస్తోంది. ఇందుకు డాక్టర్ వైవీ మల్లా రెడ్డి అంకితభావంతో పని చేయడమే కారణం.

- ఫుల్ బ్రైట్ ఫెలో (2006), ఇండో అమెరికన్ ఎన్విరాన్‌మెంటల్ లీడర్‌షిప్ ప్రోగ్రాం (ఈఎల్‌పీ) కింద కరువు నివారణ, స్వల్ప వర్షపాతంలో మెరుగైన వ్యవసాయాన్ని ఎలా చేయవచ్చనే అంశంపై మల్లారెడ్డి అమెరికాలో అధ్యయనం చేసి అనంతపురంలో అమలు చేస్తున్నారు.
- 25 దేశాల్లో 20 అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొన్నారు.
- 2004లో రైతు సంక్షేమ కమిషన్ సభ్యునిగా పని చేశారు.
- ఏపీ వాటర్ కన్జర్వేషన్ మిషన్‌లో (2000–2004) సభ్యులుగా ఉన్నారు.
- 2003–06 మధ్య అనంత గ్రామీణ బ్యాంక్ డైరెక్టర్‌గా ఉన్నారు.
- 2003–07 మధ్య నాబార్డ్ స్టేట్ లెవల్ వాటర్ షెడ్ అడ్వైజరీ కమిటీ సభ్యునిగా కొనసాగారు.
- 2019లో రాష్ట్ర ప్రభుత్వం అగ్రికల్చర్ మిషన్ సభ్యునిగా నియమించింది.
- 2007లో అనంత ప్రస్థానం అనే పుస్తకాన్ని రచించారు.
- ఎకాలజీ సెంటర్‌కు 2022లో ఉత్తమ ఎన్జీఓ అవార్డు దక్కింది. భారత ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధన్‌కర్, కేంద్ర జలవనరుల శాఖ మంత్రి గజేంద్ర షెకావత్ చేతుల మీదుగా ఈ ఏడాది జూన్ 17న అవార్డు అందుకున్నారు.





ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ (ఇన్‌సెట్) వై.వి.మల్లారెడ్డి, శ్రీకృష్ణదేవరాయలు వేషధారణలో చిగిచెర్ల కృష్ణారెడ్డి

జానపద కళాబ్రహ్మ 'చిగిచెర్ల'

జానపద కళాబ్రహ్మగా గుర్తింపు పొందిన చిగిచెర్ల కృష్ణారెడ్డి కీర్తికిరీటంలో మరో అరుదైన పురస్కారం చేరింది. జానపదంలో ఎనలేని సేవలందించిన చిగిచెర్ల కృష్ణారెడ్డి 1954లో ఉమ్మడి జిల్లా ధర్మవరం మండలం సుబ్బారావుపేటలో చిగిచెర్ల పెద్దారెడ్డి, ఓబుళమ్మ దంపతులకు జన్మించారు. 1986లో ఎస్కేయూనివర్సిటీలో జానపద కళలపై పీహెచ్‌డీ పట్టానందుకున్న ఆయన 1987 వరకు వైఎస్సార్ జిల్లా పులివెందులలోని వైఎస్ రాజారెడ్డి డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా పనిచేశారు. మరుసటి ఏడాది నుంచి 2014 వరకు పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో అధ్యాపకునిగా, రీడర్‌గా, ఆచార్యునిగా వివిధ హోదాల్లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. ఆ తర్వాత కూడా జానపద కళల ప్రాచుర్యానికి విశేషంగా శ్రమిస్తున్నారు. బోధన, పరిశోధన, గ్రంథ ప్రచురణ, కళా ప్రదర్శనలతో రెండు తెలుగు రాష్ట్రాల వారికి జానపద కళల్లో ఆసక్తిని, అనురక్తిని కల్గించిన ఆయన ఇప్పటి వరకు 2వేలకు పైగా ప్రదర్శనలిచ్చారు. స్వయంగా ఆడుతూ పాడుతూ ప్రేక్షకులను సమ్మోహితులను చేస్తూ ఆయన ఆధ్వర్యంలో సాగిన సాహిత్య, కళా ప్రదర్శనలు ఎంతో మందిలో స్ఫూర్తిని నింపాయి. ఆయన వద్ద 66 మంది ఎంఫిల్, మరో 34 మంది పీహెచ్‌డీ పట్టాలందుకున్నారు. గతంలో నవరత్నాల పేరిట ఆయన రాసిన పుస్తకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించగా.. అంతకు ముందు చిగిచెర్ల కృష్ణారెడ్డి దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి, దివంగత ప్రధాని వాజ్‌పేయి చేతుల మీదుగా పురస్కారాలు, అభినందనలు అందుకున్నారు.

జగన్‌తోనే వాల్మీకులకు గుర్తింపు





కార్యక్రమానికి హాజరైన వాల్మీకులు, మాట్లాడుతున్న మంత్రి గుమ్మనూరు జయరాం,చిత్రంలో ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే పెద్దారెడ్డి, పైలా తదితరులు

- ఘనంగా వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ట
- హాజరైన మంత్రి గుమ్మనూరు, ఎంపీ రంగయ్య, ఎమ్మెల్యే, నాయకులు

తాడిపత్రి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే వాల్మీకులకు గుర్తింపు దక్కిందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. పట్టణంలోని యల్లనూరు రోడ్ సర్కిల్ వద్ద తాడిపత్రి వాల్మీకి సేవా సమితి ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ట శుక్రవారం ఘనంగా జరిగింది. వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ సజ్జలదిన్నె రాజు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. విగ్రహ ప్రతిష్టకు ముందు హోమం, శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున వాల్మీకులు, ప్రజలు హాజరయ్యారు.ముఖ్య అతిథులుగా రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ రామచంద్ర, ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత, వైఎస్సార్ జిల్లా వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ సాకే ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పేరం స్వర్ణలత, పామిడి వీరాంజనేయులు, సజ్జలదిన్నె సర్పంచ్ నీరజ, జెడ్పీటీసీ రమణమ్మలతో పాటు పలువురు హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ వాల్మీకి మహర్షి విగ్రహం ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. వాల్మీకులకు సీఎం వైఎస్ జగన్ పెద్దపీట వేశారన్నారు. ఎస్టీల్లో చేర్చేందుకు మాట ఇవ్వడం సంతోషదాయకమన్నారు. వాల్మీకి జయంతిని మనందరం పండుగలా ఏటా జరుపుకోవాలని కోరారు.

పిల్లల భవిష్యత్‌కు పునాదులు వేయాలి..

ఎంపీ తలారి రంగయ్య మాట్లాడుతూ వాల్మీకి మహర్షి రామాయణం రాయడంతోనే వాల్మీకులకు గొప్ప పేరు వచ్చిందన్నారు. వాల్మీకులంతా ఐక్యంగా ఉంటూనే వారి పిల్లల భవిష్యత్తులకు పునాదులు వేసుకోవాలని కోరారు. అన్ని కులాలను కలుపుకుని ముందుకు వెళ్లడంతో పాటు ఆయా రంగాల్లో మనం కూడా రాణించాలని ఎంపీ ఆకాక్షించారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మాట్లాడుతూ తాడిపత్రిలో అన్ని కులాల వారూ ఉన్నారని, తాడిపత్రిని ఇన్నేళ్లు పాలించిన నియంత నాయకులు.. విగ్రహాల ఏర్పాటును అడ్డుకుంటూ వచ్చారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకొచ్చిన తర్వాత తాను ఎమ్మెల్యేగా పట్టణంలోని పలు కూడళ్లలో చాలా విగ్రహాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాల్మీకి మహర్షిని గుర్తుంచుకోవాల్సిన అవశ్యకత ఉందన్నారు. అనంతరం ఎమ్మెల్యే పెద్దారెడ్డిని వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ సజ్జలదిన్నె రాజు ఆధ్వర్యంలో సమితి తరఫున సన్మానించారు. కార్యక్రమంలో తాడిపత్రి వాల్మీకి సేవా సమితి సభ్యులు, ప్రజలు, భక్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం రైల్వేస్టేషన్ తనిఖీ



డీఆర్‌ఎం హర్షఖరేకు సమస్యలను విన్నవిస్తున్న రైల్వే యాక్షన్ కమిటీ సభ్యులు, ప్రయాణికులు

రాయదుర్గంటౌన్: కదిరిదేవరపల్లి, దొడ్డహళ్లి, కళ్యాణదుర్గం, ఆవులదట్ల, రాయదుర్గం రైల్వేస్టేషన్లను నైరుతీ రైల్వే హుబ్లి డివిజన్ డీఆర్‌ఎం హర్షఖరే శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కదిరిదేవరపల్లి వరకు ఆయన ప్రత్యేక రైలులో వచ్చారు. తిరుగు ప్రయాణంలో రాయదుర్గం రైల్వే స్టేషన్‌ను పరిశీలించారు. స్టేషన్‌లో పలు విభాగాలను తనిఖీ చేసి అధికారులు, సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం రైల్వే సలహా సంఘం మాజీ సభ్యులు గుడేకోట శివకుమార్, రైల్వే ప్రయాణికులు, ప్రముఖులు కేకేటీ రవి, అంభోజీరావు తదితరులు స్టేషన్‌లో నెలకొన్న సమస్యలు, రైళ్ల రాకపోకలపై డీఆర్‌ఎంను కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. యశ్వంత్‌పూర్– కారటిగి రైలును రాయదుర్గం మీదుగానే నడపాలని విన్నవించారు.

పదహేను రోజుల్లో బీటీపీ పనులు ప్రారంభం

- సచివాలయ ప్రారంభోత్సవంలో మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్



సచివాలయం శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్

శెట్టూరు: పదిహేను రోజుల్లో బీటీపీ ప్రాజెక్టు పనులను ప్రారంభిస్తామని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. జీడిపల్లి రిజర్వాయర్ నుంచి కళ్యాణదుర్గం నియోజకవర్గానికి బీటీపీ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందిస్తామన్నారు. 114 చెరువులకు నీరు తీసుకొచ్చి కళ్యాణదుర్గ ప్రాంత రైతులను వ్యవసాయంలో ప్రోత్సహించి, లక్షాధికారులను చేస్తామన్నారు. శుక్రవారం మండలంలోని పెరుగుపాళ్యం గ్రామంలో నూతన సచివాలయ భవనం ప్రారంభోత్సవం జరిగింది. ముఖ్యఅతిథులుగా మంత్రి కేవీ ఉషశ్రీచరణ్‌తో పాటు నియోజకవర్గ పరిశీలకులు ఎంఆర్‌సీ రెడ్డి హాజరయ్యారు. మంత్రి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే గ్రామ స్వరాజ్య స్థాపన సాధ్యమైందన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటింటికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ఖరీదైన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. టీడీపీ కార్యకర్తలకు సైతం సంక్షేమ పథకాలను అందిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారన్నారు. హైదరాబాద్, కేరళ తదితర నగరాలకు వలస వెళ్లిన వారందరినీ తీసుకొచ్చి, వ్యవసాయం చేసేలా అవకాశం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పీఆర్‌డీఈ రాజన్న, తహసీల్దార్ ఫణికుమార్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రఘురామరావు, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ తిమ్మరాజమ్మ, జేసీఎస్ కన్వీనర్లు తిమ్మరాజు, రాము, మండల కన్వీనర్ శివన్న యాదవ్, మాజీ ఎంపీపీ రాంభీమప్ప, కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, స్థానిక ఎంపీటీసీ లక్ష్మీదేవి, సర్పంచులు గంగాధర, వెంకటేశులు, నాగరాజు, ఈరన్న, నాయకులు హరినాథ్‌రెడ్డి, సోమశేఖర్, రామకృష్ణ పాల్గొన్నారు.

సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు



సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

అనంతపురం క్రైం: పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహించారు. జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సిబ్బంది సమస్యలను నేరుగా ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. 25 మంది జిల్లా ఎస్పీకి పలు స్టేషన్ల నుంచి వినతులు అందించారు. సిబ్బంది సమస్యలకు చట్టపరిధిలో పరిష్కారం చూపుతామని ఎస్పీ పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్.విజయభాస్కరరెడ్డి, హనుమంతు, డీపీఓ ఏఓ శంకర్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు త్రిలోక్, సుధాకర్‌రెడ్డి, తేజ్‌పాల్, గాండ్ల హరినాథ్, శ్రీనివాసుల నాయుడు, శివప్రసాద్, ఎస్పీ సీసీ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పండ్లతోటల రైతు సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నిక



ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి

అనంతపురం అర్బన్: తాడిపత్రిలో ఈనెల 19న జరిగిన రాష్ట్ర సదస్సులో పండ్లతోటల రైతు సంఘం రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యదర్శిగా ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆయన శుక్రవారం వివరాలు వెల్లడించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వి.శివారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులుగా త్రిలోక్, రాజారామిరెడ్డి, వెంకటచౌదరి, గార్లదిన్నె చెన్నారెడ్డి, వరదాయపల్లి లక్ష్మీనారాయణరెడ్డి ఎన్నికయ్యారని తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడిన మద్యం బాక్సులను చూపుతున్న సీఐ జయనాథ్‌రెడ్డి,పోలీసులు

రాయదుర్గం: గుమ్మఘట్ట మండలం గొల్లపల్లి సమీపంలో 960 టెట్రా ప్యాకెట్లు (కర్ణాటక మద్యం) పట్టుబడినట్లు సెబ్‌సీఐ జయనాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కర్ణాటక రాష్ట్రం నుంచి రాయదుర్గానికి నీరుగంటి పాండురంగ, నాయకుల తిప్పేస్వామి, జగలూరి బాలన్న మద్యం తరలిస్తుండగా పట్టుబడ్డారన్నారు. వారి నుంచి రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐ హరికృష్ణ , హెడ్‌కానిస్టేబుల్ సోమశేఖర్, సిబ్బంది శివయ్య, ఇమ్రాన్, తిమ్మన్న, జ్యోతి, అనిల్ పాల్గొన్నారు.

విలేజ్ సర్వేయర్‌పై గుర్తు తెలియని వ్యక్తుల దాడి



గాయపడిన ఆనంద్

పుట్లూరు: మండలంలోని మడ్డిపల్లి – మడుగుపల్లి రోడ్డుపై శుక్రవారం ఉదయం కుమ్మనమల విలేజ్ సర్వేయర్‌పై గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. ఉద్యోగ రీత్యా కుమ్మనమల సచివాలయం నుంచి రీసర్వే పనుల్లో భాగంగా మడుగుపల్లికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, దాడి జరిగినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

విడపనకల్లు: మండలంలోని పాల్తూరుకు చెందిన చాకలి తిప్పేస్వామి (59) పాముకాటుకు గురై శుక్రవారం మృతి చెందాడు. వివరాలు.. చాకలి తిప్పేస్వామి ఉదయం కల్లంలో పనిచేస్తుండగా పాముకాటుకు గురయ్యాడు. వెంటనే అతన్ని చికిత్స కోసం ఉరవకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ తిప్పేస్వామి మృతి చెందారు. పాల్తూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి

ప్రాంతీయ కార్యాలయం, అనంతపురము , డి.నెం.6-3-145, రెవిన్యూ వార్డునెం.6, రాంనగర్, అనంతపురము- 515004, ఫోన్: 08554-226066, ఈమెయిల్:roatp-ee1@appcb.gov.in

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ ప్రకటన

కేంద్ర పర్యావరణ, అడవులు మరియు వాతావరణ మార్పులు మంత్రిత్వ శాఖ ప్రకటన నెం.యస్.ఓ.1533, తేది:14.09.2006 మరియు తదుపరి సవరణలకు అనుగుణంగా మెస్సర్స్ లోటస్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ వారు అనంతపురము జిల్లా & మండలం, చియ్యేడు గ్రామం సర్వే నెం231 నందు 12.588 హెక్టార్ల విస్తీర్ణంలో రోడ్డు మెటల్, బిల్డింగ్ స్టోను, ఎం.శాండ్ బౌల్డర్లు & గ్రావెల్ మైను స్థాపన కొరకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారిచే పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కొరకు ఈ ప్రకటన జారీ చేయడమైనది. ప్రతిపాదిత ప్రాజెక్ట్ వివరములు దిగువ పేర్కొనబడినవి:

1. కంపెనీ పేరు, చిరునామా మరియు టెలిఫోన్ నెం.	మెస్సర్స్ లోటస్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్, సర్వేనెం.231, చియ్యేడు గ్రామం, అనంతపురము మండలం & జిల్లా, ఆంధ్రప్రదేశ్,
2. ప్రతిపాదిత స్థాపన ప్రదేశం సర్వేనెంబర్లతో సహా & భూమి విస్తీర్ణం	సర్వేనెం.231, చియ్యేడు గ్రామం, అనంతపురము మండలం & జిల్లా ఆంధ్రప్రదేశ్ నందు మొత్తం మైను విస్తీర్ణం 12.588 హెక్టార్లు
3. సంప్రదించవలసిన వ్యక్తి పేరు, చిరునామా మరియు ఫోన్ నెంబరు	మెస్సర్స్ లోటస్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ మేనేజింగ్ పార్ట్‌నర్ శ్రీ ఎ.వి.రామారావు, తండ్రి వెంకటనరసింహారావు, డి.నెం.54-18-27/ఎ, ఎల్‌ఐసికాలనీ, విజయవాడ - 515721, ఫోన్: 98858 29669
4. ప్రతిపాదిత ప్రాజెక్టుకు కేటాయించిన పెట్టుబడి	రూ.100.00 లక్షలు
5. ప్రతిపాదిత కార్యకలాపాల వివరములు	రోడ్డు మెటల్, బిల్డింగ్ స్టోన్ & ఎం.శాండ్ బౌల్డర్లు - 4,77,945 m3/Annum ల మరియు గ్రావెల్ - 62,388 m3/Annum ల మైనింగ్ కొరకు
6. ప్రజాభిప్రాయ సేకరణ తేది, సమయం మరియు ప్రదేశం	తేది : 21.11.2023 సమయం : మ.12.00 గం॥లకు ప్రదేశం : ప్రతిపాదిత మైను స్థలం దగ్గర, చియ్యేడు గ్రామం, అనంతపురము మండలం & జిల్లా, ఆంధ్రప్రదేశ్

7. ప్రతిపాదించిన ప్రాజెక్టు యొక్క కార్యనిర్వాహక సారాంశం(తెలుగు & ఇంగ్లీష్) & డ్రాఫ్ట్ REIA సాధారణ ప్రజానీకం పరిశీలన కొరకు అందుబాటులో వుంచిన ప్రదేశాలు.
ఎ) జిల్లా కలెక్టరు & మేజిస్ట్రేట్ వారి కార్యాలయము, అనంతపురము జిల్లా, అనంతపురము
బి) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వారి కార్యాలయం, జిల్లా పరిషత్, అనంతపురము జిల్లా, అనంతపురము
సి) జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ వారి కార్యాలయం, APPCB, క్షేత్రీయ కార్యాలయం, కర్నూలు
డి) జనరల్ మేనేజర్ వారి కార్యాలయం, జిల్లా పరిశ్రమల కేంద్రం, అనంతపురము
ఇ) పర్యావరణ, అటవీ & వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, ప్రాంతీయ కార్యాలయం,(ఐఆర్‌ఓ) గ్రీన్‌హౌస్ కాంప్లెక్స్, గోపాల్‌రెడ్డి రోడ్డు, విజయవాడ - 520010
ఎఫ్) ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ వారి కార్యాలయం, APPCB ప్రాంతీయ కార్యాలయం, అనంతపురము, అనంతపురము జిల్లా
జి) తహశీల్దార్ వారి కార్యాలయము, అనంతపురము మండలం& జిల్లా
హెచ్) గ్రామ పంచాయతీ కార్యాలయము, చియ్యేడు గ్రామం, అనంతపురము మండలం & జిల్లా

ఈ విస్తరణ మూలంగా స్థానికంగా ప్రభావితమగు వ్యక్తులు మరియు ఇతర సంబంధిత వ్యక్తులందరూ (MoE&F నోటిఫికేషన్ నెం.ఎస్.ఓ. 1533, తేది: 14.09.2006 యొక్క వరుస నెం.7(III)(ii) (ఎ) మరియు (బి)నిర్వచించినట్లుగా) ఈ ప్రకటన వెలువడిన తేది నుండి 30 దినములలోగా తమ లిఖిత పూర్వక స్పందనలను క్రింది సంతకం దారునకు దాఖలు చేయవచ్చును. అట్టివారు పైన తెలియపరచిన సమయం, తేది యందు నిర్వహింపబడు పర్యావరణప్రజాభిప్రాయ సేకరణ యందు పాల్గొనవచ్చును.

ప్రదేశం : అనంతపురము
తేది : 20.10.2023

సం/-
పర్యావరణ ఇంజనీర్,
ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయము, అనంతపురము

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి

ప్రాంతీయ కార్యాలయం, అనంతపురము , డి.నెం.6-3-145, రెవిన్యూ వార్డునెం.6, రాంనగర్, అనంతపురము- 515004, ఫోన్: 08554-226066, ఈమెయిల్:roatp-ee1@appcb.gov.in

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ ప్రకటన

కేంద్ర పర్యావరణ, అడవులు మరియు వాతావరణ మార్పులు మంత్రిత్వ శాఖ ప్రకటన నెం.యస్.ఓ.1533, తేది:14.09.2006 మరియు తదుపరి సవరణలకు అనుగుణంగా మెస్సర్స్ లోటస్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ వారు అనంతపురము జిల్లా & మండలం, చియ్యేడు గ్రామం సర్వే నెం231 నందు 6.360 హెక్టార్ల విస్తీర్ణంలో రోడ్డు మెటల్, బిల్డింగ్ స్టోను, ఎం.శాండ్ బౌల్డర్లు & గ్రావెల్ మైను స్థాపన కొరకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారిచే పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కొరకు ఈ ప్రకటన జారీ చేయడమైనది. ప్రతిపాదిత ప్రాజెక్ట్ వివరములు దిగువ పేర్కొనబడినవి:

1. కంపెనీ పేరు, చిరునామా మరియు టెలిఫోన్ నెం.	మెస్సర్స్ లోటస్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్, సర్వేనెం.231, చియ్యేడు గ్రామం, అనంతపురము మండలం & జిల్లా, ఆంధ్రప్రదేశ్,
2. ప్రతిపాదిత స్థాపన ప్రదేశం సర్వేనెంబర్లతో సహా & భూమి విస్తీర్ణం	సర్వేనెం.231, చియ్యేడు గ్రామం, అనంతపురము మండలం & జిల్లా ఆంధ్రప్రదేశ్ నందు మొత్తం మైను విస్తీర్ణం 6.360హెక్టార్లు
3. సంప్రదించవలసిన వ్యక్తి పేరు, చిరునామా మరియు ఫోన్ నెంబరు	మెస్సర్స్ లోటస్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్ మేనేజింగ్ పార్ట్‌నర్ శ్రీ ఎ.వి.రామారావు, తండ్రి వెంకటనరసింహారావు, డి.నెం.54-18-27/ఎ, ఎల్‌ఐసికాలనీ, విజయవాడ - 515721, ఫోన్: 98858 29669
4. ప్రతిపాదిత ప్రాజెక్టుకు కేటాయించిన పెట్టుబడి	రూ.100.00 లక్షలు
5. ప్రతిపాదిత కార్యకలాపాల వివరములు	రోడ్డు మెటల్, బిల్డింగ్ స్టోన్ & ఎం.శాండ్ బౌల్డర్లు - 46,754 m3/Annum ల మరియు గ్రావెల్ - 28,127 m3/Annum ల మైనింగ్ కొరకు
6. ప్రజాభిప్రాయ సేకరణ తేది, సమయం మరియు ప్రదేశం	తేది : 21.11.2023 సమయం : ఉ.10.00 గం॥లకు ప్రదేశం : ప్రతిపాదిత మైను స్థలం దగ్గర, చియ్యేడు గ్రామం, అనంతపురము మండలం & జిల్లా, ఆంధ్రప్రదేశ్

7. ప్రతిపాదించిన ప్రాజెక్టు యొక్క కార్యనిర్వాహక సారాంశం(తెలుగు & ఇంగ్లీష్) & డ్రాఫ్ట్ REIA సాధారణ ప్రజానీకం పరిశీలన కొరకు అందుబాటులో వుంచిన ప్రదేశాలు.
ఎ) జిల్లా కలెక్టరు & మేజిస్ట్రేట్ వారి కార్యాలయము, అనంతపురము జిల్లా, అనంతపురము
బి) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వారి కార్యాలయం, జిల్లా పరిషత్, అనంతపురము జిల్లా, అనంతపురము
సి) జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ వారి కార్యాలయం, APPCB, క్షేత్రీయ కార్యాలయం, కర్నూలు
డి) జనరల్ మేనేజర్ వారి కార్యాలయం, జిల్లా పరిశ్రమల కేంద్రం, అనంతపురము
ఇ) పర్యావరణ, అటవీ & వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, ప్రాంతీయ కార్యాలయం,(ఐఆర్‌ఓ) గ్రీన్‌హౌస్ కాంప్లెక్స్, గోపాల్‌రెడ్డి రోడ్డు, విజయవాడ - 520010
ఎఫ్) ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ వారి కార్యాలయం, APPCB ప్రాంతీయ కార్యాలయం, అనంతపురము, అనంతపురము జిల్లా
జి) తహశీల్దార్ వారి కార్యాలయము, అనంతపురము మండలం& జిల్లా
హెచ్) గ్రామ పంచాయతీ కార్యాలయము, చియ్యేడు గ్రామం, అనంతపురము మండలం & జిల్లా

ఈ విస్తరణ మూలంగా స్థానికంగా ప్రభావితమగు వ్యక్తులు మరియు ఇతర సంబంధిత వ్యక్తులందరూ (MoE&F నోటిఫికేషన్ నెం.ఎస్.ఓ. 1533, తేది: 14.09.2006 యొక్క వరుస నెం.7(III)(ii) (ఎ) మరియు (బి)నిర్వచించినట్లుగా) ఈ ప్రకటన వెలువడిన తేది నుండి 30 దినములలోగా తమ లిఖిత పూర్వక స్పందనలను క్రింది సంతకం దారునకు దాఖలు చేయవచ్చును. అట్టివారు పైన తెలియపరచిన సమయం, తేది యందు నిర్వహింపబడు పర్యావరణప్రజాభిప్రాయ సేకరణ యందు పాల్గొనవచ్చును.

ప్రదేశం : అనంతపురము
తేది : 20.10.2023

సం/-
పర్యావరణ ఇంజనీర్,
ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయము, అనంతపురము

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి

ప్రాంతీయ కార్యాలయం, అనంతపురము , డి.నెం.6-3-145, రెవిన్యూ వార్డునెం.6, రాంనగర్, అనంతపురము- 515004, ఫోన్: 08554-226066, ఈమెయిల్:roatp-ee1@appcb.gov.in

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ ప్రకటన

కేంద్ర పర్యావరణ, అడవులు మరియు వాతావరణ మార్పులు మంత్రిత్వ శాఖ ప్రకటన నెం.యస్.ఓ.1533, తేది:14.09.2006 మరియు తదుపరి సవరణలకు అనుగుణంగా శ్రీ రావి శ్రీనివాసచౌదరి గారు అనంతపురము జిల్లా, అనంతపురము మండలం, మన్నీల గ్రామం సర్వే నెం. 28 నందు 2.857 హెక్టార్ల విస్తీర్ణంలో రోడ్డు మెటల్, బిల్డింగ్ స్టోను& గ్రావెల్ మైను స్థాపన కొరకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారిచే పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కొరకు ఈ ప్రకటన జారీ చేయడమైనది. ప్రతిపాదిత ప్రాజెక్ట్ వివరములు దిగువ పేర్కొనబడినవి:

1. కంపెనీ పేరు, చిరునామా మరియు టెలిఫోన్ నెం.	శ్రీ రావి శ్రీనివాస చౌదరి, సర్వేనెం.28, మన్నీల గ్రామం, అనంతపురము మండలం అనంతపురము జిల్లా, ఆంధ్రప్రదేశ్,
2. ప్రతిపాదిత స్థాపన ప్రదేశం సర్వేనెంబర్లతో సహా & భూమి విస్తీర్ణం	సర్వేనెం.28, మన్నీల గ్రామం, అనంతపురము మండలం & జిల్లా ఆంధ్రప్రదేశ్ నందు మొత్తం మైను విస్తీర్ణం 2.857 హెక్టార్లు
3. సంప్రదించవలసిన వ్యక్తి పేరు, చిరునామా మరియు ఫోన్ నెంబరు	శ్రీ రావి శ్రీనివాస చౌదరి, తండ్రి రావి సరోజ నాయుడు, ఫ్లాట్ నెం.102, రాజహంస ప్యాలెస్, అనంతపురము మండలము, ఫోన్: 9440384615
4. ప్రతిపాదిత ప్రాజెక్టుకు కేటాయించిన పెట్టుబడి	రూ.35.00 లక్షలు
5. ప్రతిపాదిత కార్యకలాపాల వివరములు	రోడ్డు మెటల్, బిల్డింగ్ స్టోన్ - 22,094 m3/Annum ల మరియు గ్రావెల్ - 36,841 m3/Annum ల మైనింగ్ కొరకు
6. ప్రజాభిప్రాయ సేకరణ తేది, సమయం మరియు ప్రదేశం	తేది : 21.11.2023 సమయం : మ.2.00 గం॥లకు ప్రదేశం : ప్రతిపాదిత మైను స్థలం దగ్గర, మన్నీల గ్రామం, అనంతపురము మండలం & జిల్లా, ఆంధ్రప్రదేశ్

7. ప్రతిపాదించిన ప్రాజెక్టు యొక్క కార్యనిర్వాహక సారాంశం(తెలుగు & ఇంగ్లీష్) & డ్రాఫ్ట్ REIA సాధారణ ప్రజానీకం పరిశీలన కొరకు అందుబాటులో వుంచిన ప్రదేశాలు.
ఎ) జిల్లా కలెక్టరు & మేజిస్ట్రేట్ వారి కార్యాలయము, అనంతపురము జిల్లా, అనంతపురము
బి) చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వారి కార్యాలయం, జిల్లా పరిషత్, అనంతపురము జిల్లా, అనంతపురము
సి) జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ వారి కార్యాలయం, APPCB, క్షేత్రీయ కార్యాలయం, కర్నూలు
డి) జనరల్ మేనేజర్ వారి కార్యాలయం, జిల్లా పరిశ్రమల కేంద్రం, అనంతపురము
ఇ) పర్యావరణ, అటవీ & వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం, ప్రాంతీయ కార్యాలయం,(ఐఆర్‌ఓ) గ్రీన్‌హౌస్ కాంప్లెక్స్, గోపాల్‌రెడ్డి రోడ్డు, విజయవాడ - 520010
ఎఫ్) ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ వారి కార్యాలయం, APPCB ప్రాంతీయ కార్యాలయం, అనంతపురము, అనంతపురము జిల్లా
జి) తహశీల్దార్ వారి కార్యాలయము, అనంతపురము మండలం& జిల్లా
హెచ్) గ్రామ పంచాయతీ కార్యాలయము, మన్నీల గ్రామం, అనంతపురము మండలం & జిల్లా

ఈ విస్తరణ మూలంగా స్థానికంగా ప్రభావితమగు వ్యక్తులు మరియు ఇతర సంబంధిత వ్యక్తులందరూ (MoE&F నోటిఫికేషన్ నెం.ఎస్.ఓ. 1533, తేది: 14.09.2006 యొక్క వరుస నెం.7(III)(ii) (ఎ) మరియు (బి)నిర్వచించినట్లుగా) ఈ ప్రకటన వెలువడిన తేది నుండి 30 దినములలోగా తమ లిఖిత పూర్వక స్పందనలను క్రింది సంతకం దారునకు దాఖలు చేయవచ్చును. అట్టివారు పైన తెలియపరచిన సమయం, తేది యందు నిర్వహింపబడు పర్యావరణప్రజాభిప్రాయ సేకరణ యందు పాల్గొనవచ్చును.

ప్రదేశం : అనంతపురము
తేది : 20.10.2023

సం/-
పర్యావరణ ఇంజనీర్,
ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయము, అనంతపురము

క్లుప్తంగా

వైభవంగా బ్రహ్మోత్సవాలు



గజవాహనంపై లక్ష్మీ వేంకటేశ్వరుడు

అనంతపురం కల్చరల్: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం ఆర్ఎఫ్రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పుష్పాలంకరణలు, అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. స్వామివారు ఆలయ ప్రాకారోత్సవంలో గజ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రమణారెడ్డి, పాలక మండలి సభ్యులు, అర్చకులు హరికిషోర్ శర్మ తదితరులు ఆలయంలో మూలానక్షత్ర హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాత్రి వాహన సేవల్లో కళాకారులు కళాజాతాతో ఆకట్టుకున్నారు. రామనగర్, హౌసింగుబోర్డు, శ్రీనివాసనగర్లోని వేంకటేశ్వరాలయాల్లో బ్రహ్మోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి.

పేద మహిళలకు చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న అవోపా మహిళా విభాగం నాయకులు

అనంతపురం కల్చరల్: ఆర్యవైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గూడూరు అనురాధ నేతృత్వంలో శుక్రవారం నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని స్థానిక టవర్‌క్లాక్ వద్ద సాగిన సేవా కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఉండమ్మా బొట్టు పెడతా, దీర్ఘ సుమంగళి కార్యక్రమాలకు నాంది పలుకుతున్నామని తెలిపారు. నిరుపేద మహిళలకు చీరలు, పసుపు, కుంకుమ, పూలు, పండ్లు అందించడానికి అవోపా మహిళా విభాగం కృషి చేస్తోందన్నారు.

అందరికీ మంచి జరగాలి



దుర్గామాత పూజా కార్యక్రమంలో పాల్గొన్న వీసీ రంగజనార్దన తదితరులు

అనంతపురం: దుర్గామాత ఆశీస్సులతో అందరికీ మంచి జరగాలని జేఎన్‌టీయూఏ వీసీ జింకా రంగజనార్దన ఆకాంక్షించారు. యూనివర్సిటీ క్యాంపస్‌లో నూతనంగా నిర్మించిన లెక్చరర్స్ హాల్ కాంప్లెక్స్‌లో ఎస్ఎస్ఎస్ ఆధ్వర్యంలో దుర్గాపూజ నిర్వహించారు. వీసీ ముఖ్య అతిథిగా హాజరై పూజలు చేశారు. అనంతరం ఆయన దుర్గామాత ప్రాముఖ్యత, ఆయుధ పూజ ఆవశ్యకతను తెలియజేశారు. అనంతరం ఖాదీ మహోత్సవంలో భాగంగా ఖాదీ విశిష్టతను వివరించారు. విద్యార్థులు నిర్వహించిన ఖాదీ వస్త్ర ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సి.శశిధర్, ప్రిన్సిపాల్ ఎస్వీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ అరుణ కాంతి, డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ ఎం .రామశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశే లక్ష్యం



కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

చెన్నేకొత్తపల్లి: రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఆ దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ సభ్యుడు గోవిందరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కనుముక్కల గ్రామంలో ఎంపీడీఓ గంగావతి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య శిబిరంలో ఎన్ఎస్ గేట్ పీహెచ్‌సీ వైద్యులు ఉదయ్ ఆధ్వర్యంలో 540 మంది రోగులకు వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రమాదేవి, ఈఓఆర్డీ అశోక్‌నాయక్, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

బాలునికి డెంగీ

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని ఇస్లాంపూర్ కాలనీలో ఓ బాలునికి డెంగీ సోకిన ఘటన శుక్రవారం వెలుగుచూసింది. కాలనీలో అక్రమ్–3 సంవత్సరాల బాలునికి డెంగీ జ్వరం వచ్చినట్లు డాక్టర్ స్వాతి లక్ష్మి తెలిపారు. దీంతో మండల వైద్య సిబ్బంది ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటుతో పాటు పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. కాలనీలో వైద్య సిబ్బంది సర్వే చేపట్టారు. సీహెచ్ఓ మోహన్‌రావు, సూపర్‌వైజర్లు బాషా, శ్రీధర్, పంచాయతీ సెక్రటరి సాదిక్‌వలి తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ నమస్తుభ్యం



కొత్తూరు అమ్మవారి శాల వద్ద తోటోత్సవ దృశ్యం

అనంతపురం కల్చరల్: శరన్నవరాత్రి మహోత్సవాల్లో ప్రధాన పండుగలు శుక్రవారం నుంచి ఘనంగా ఆరంభమయ్యాయి. మూలా నక్షత్రం రావడంతో వాడవాడలా అమ్మవారు చదువుతల్లి సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. నగరంలోని కొత్తూరు వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారిని నగర వీధుల్లో తోటోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. హెచ్చెల్సీ కాలనీలోని నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో కార్పొరేటర్ గురుశేఖరబాబు నేతృత్వంలో సామూహిక అక్షరాభ్యాసాలు, అలంకార సేవల్లో ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, నగరపాలక కమిషనర్ భాగ్యలక్ష్మి ఆత్మీయ అతిథులుగా హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో వారాహిగా అమ్మవారు పూజలందుకున్నారు. పాతూరు, శివబాలయోగి ఆశ్రమం, శృంగేరి శంకర మఠం, శివకోటి తదితర చోట్ల అమ్మవారు చదువుతల్లిగా దర్శనమిచ్చారు. రెండో రోడ్డులోని చంద్రశేఖరేంద్ర సరస్వతీ జ్ఞానపీఠం ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అలంకార సేవలు, చండీహోమం, గ్రామోత్సవం నిర్వహించారు.



శంకర మఠంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు చేయిస్తున్న దృశ్యం



నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



చంద్రశేఖరేంద్ర సరస్వతీ జ్ఞానపీఠం ఆధ్వర్యంలో పూజలందుకున్న అమ్మవారు

నేడు వైద్య శిబిరాలు

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు కమిషనర్ భాగ్యలక్ష్మి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాణీనగర్‌లోని ఆశ నగరపాలక ఉన్నత పాఠశాల, అరవిందనగర్‌లోని శ్రీ కృష్ణదేవరాయ ప్రభుత్వ పాఠశాలలో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, 12, 45వ సచివాలయాల పరిధిలోని ఫెర్రర్ కాలనీ, నాయక్‌నగర్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

రామగిరి: మండలంలోని గరిమేకలపల్లికి చెందిన అశోక్‌కుమార్ (20) రెండురోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. బెంగళూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. విషయం తెలుసుకున్న మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కర్రా హనుమంతరెడ్డి, మండల అగ్రి బోర్డ్ చైర్మన్ నరసింహారెడ్డి, సర్పంచ్ సిద్ధన్న, నర్సిరెడ్డి తదితరులు మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి రూ.20 వేలను ఆర్థికసాయం అందించారు.

‘సురక్ష’ శిబిరాలను వినియోగించుకోండి

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనంత

అనంతపురం మెడికల్: ‘జగనన్న ఆరోగ్య సురక్ష’ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రజలకు సూచించారు. శుక్రవారం నగరంలోని సాయినగర్, రాణీనగర్‌లో వైద్య శిబిరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి.. పేద ,సామాన్య, మధ్య తరగతి ప్రజలకు వైద్య సేవలందిస్తున్నారని కొనియాడారు. ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయడమే కాకుండా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా ఇంటి ముంగిటకే వైద్యం తీసుకొచ్చారన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడానికి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను ఏర్పాటు చేశారని, వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వెంట డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కమిషనర్ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు బాలాంజినేయులు, ఎం.దేవి, వై.దేవి, జేసీఎస్ కన్వీనర్ లక్ష్మన్న తదితరులు ఉన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



వద్దుపల్లిలో ప్రత్యేక అలంకరణలో పెద్దమ్మ

ఆత్మకూరు: శరన్నవరాత్రుల్లో భాగంగా ఆలయాల్లో అమ్మవార్లకు శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆత్మకూరులోని కన్యకాపరమేశ్వరి, వద్దుపల్లిలోని సుంకులమ్మ , పాలిమేర పెద్దమ్మ తల్లి, పంపనూరులోని పార్వతిదేవి విభిన్న రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

భక్తుల కొంగు బంగారం వశీకారప్పస్వామి



వశీకారప్పస్వామి బ్రహ్మోత్సవాలకు జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మను ఆహ్వానిస్తున్న కాపులు



వశీకారప్పస్వామి

- ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

రాప్తాడు: మండల పరిధిలోని మరూరు గ్రామంలో వెలసిన వశీకారప్ప స్వామి భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్నారు. స్థానికులతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు వశీకారప్ప స్వామిని ఇలవేల్పుగా కొలుస్తారు. శుక్రవారం ఆలయంలో వశీకారప్ప స్వామి వెండి గుర్రం విజయదశమి బ్రహ్మోత్సవాలు మొదలయ్యాయి. ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవ పూజలను కుల గురువు శాంత మూర్తిస్వామి తెల్లవారుజామున 4 గంటల నుంచే ప్రారంభించారు. వశీకారప్ప స్వామి డెవలప్‌మెంట్ ట్రస్ట్ చైర్మన్ బుడగ లక్ష్మీనారాయణ పూజలను దగ్గరుండి పర్యవేక్షించారు.

నేటి నుండి ఆలయంలో ప్రత్యేక పూజలు

వశీకారప్పస్వామి ఆలయంలో 20 నుంచి 24వ తేదీ వరకూ ప్రతిరోజు స్వామి వారికి నిత్య పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. 23న విజయదశమి రోజున తెల్లవారుజామున 3 గంటలకు స్వామి వారికి రుద్రాభిషేకం, నిండు పూజ, మహా మంగళ హారతిస్తారు. 9 గంటలకు స్వామికి పంజులాట, 10 గంటలకు పూల గంప, పాలకావడిలతో గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహిస్తారు. సాయంత్రం 3 గంటలకు స్వామి వెండి గుర్రాల రథంపై వందలాది సాంస్కృతిక కళాకారుల బృందాలు, వేలాది భక్తులతో భారీ ఊరేగింపుతో జమ్మి వృక్షము వరకూ తీసుకెళ్లి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అదేరోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తారు.

ఆస్పత్రికి ‘అమ్మ’ చేయూత




ఫ్యాన్లు అందజేస్తున్న తరిమెల రమణారెడ్డి

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రికి ‘అమ్మ సోషియల్ వెల్ఫేర్ అసోసియేషన్ చేయూత అందించింది. ఆస్పత్రికి వచ్చే రోగుల సౌకర్యార్థం 15 సీలింగ్ ఫ్యాన్లు విరాళంగా అందజేసింది. ఈ మేరకు అమ్మ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి శుక్రవారం సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావును కలిసి ఫ్యాన్లు అందించారు. భవిష్యత్తులో రోగులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంఓ డాక్టర్ హేమలత తదితరులు పాల్గొన్నారు.

విమర్శకు అగ్ర తాంబూలం

- విమలాశాంతి అవార్డుకు ఎంపికైన రాచపాళెం చంద్రశేఖరరెడ్డి



రాచపాళెం చంద్రశేఖరరెడ్డి

అనంతపురం కల్చరల్: ప్రగతిశీల దృక్పథంతో తెలుగు సాహిత్యానికి, ముఖ్యంగా విమర్శ ప్రక్రియకు జాతీయస్థాయిలో కీర్తితెచ్చిన రాచపాళెం చంద్రశేఖరరెడ్డి మరో ప్రతిష్టాత్మక అవార్డుకు ఎంపికయ్యారు. రాచపాళెం తొలిరోజుల్లో సంప్రదాయ కవిత్వాన్ని వెలువరించినా.. తర్వాతి రోజుల్లో తన రచనా శైలిని శాస్త్రీయ ఆలోచనలు రేకెత్తించే అభ్యుదయ భావజాలంతో సాగిస్తూ వందల సంఖ్యలో శిష్యబృందాన్ని తీర్చిదిద్దారు. ఏటా ప్రతిష్టాత్మక వ్యక్తులకు అందించే విమలాశాంతి సాహిత్య పురస్కారానికి రెండు తెలుగు రాష్ట్రాలలో విమర్శ ప్రక్రియకు ప్రసిద్ధులైన రాచపాళెంను జ్యూరీ సభ్యులుగా వ్యవహరించిన ప్రముఖ సాహితీవేత్తలు ఆచార్య మేడిపల్లి రవికుమార్, అట్టాడ అప్పల్నాయుడు, ఆచార్య ఎస్వీ సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రాచపాళెం చంద్రశేఖరరెడ్డిని సాహితీ సంస్థల ప్రతినిధులు, పలువురు రచయితలు, కవులు అభినందించారు.

ఎస్ఎస్‌బీఎన్ వేదికగా రేపు పురస్కారం ప్రదానం

ఈ నెల 22న ఉదయం పది గంటలకు నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో జరిగే కార్యక్రమంలో రాచపాళెం చంద్రశేఖరరెడ్డికి జాతీయ విమలా శాంతి సాహిత్య స్మారక అవార్డును అందజేయనున్నారు. ఈ మేరకు విమలా శాంతి సాహిత్య సేవా సమితి చైర్మన్ డాక్టర్ శాంతినారాయణ స్వగృహంలో జరిగిన సమావేశంలో వివరాలను వెల్లడించారు. గుర్రం జాషువా కళాపీఠం వ్యవస్థాపకులు డొక్కా మాణిక్య వరప్రసాద్, కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి, ఆచార్య మేడిపల్లి రవికుమార్ చేతుల మీదుగా రాచపాళెంకు నగదు పురస్కారంతో పాటూ జ్ఞాపికను అందజేసి సత్కరించనున్నట్లు తెలిపారు.

రామగోవిందు కళాసేవలు అభినందనీయం



రామగోవిందును సత్కరిస్తున్న కళాకారులు

అనంతపురం కల్చరల్: రామగోవిందు కళాసేవలు అభినందనీయమని లలితకళాపరిషత్తు అధ్యక్ష, కార్యదర్శులు వెంకటసుబ్బయ్య, పద్మజ అన్నారు. అమెరికా వెళ్లి ఆరు నెలలపాటు అక్కడి కళా సంస్థల స్థితిగతులపై అధ్యయనం చేసిన రామగోవిందు అనంతపురం చేరుకున్న సందర్భంగా శుక్రవారం లలిత కళాపరిషత్తులో కళాకారులు ఘనంగా సత్కరించారు. అధ్యక్ష, కార్యదర్శులు వెంకటసుబ్బయ్య, పద్మజ మాట్లాడుతూ దుర్యోధనుడిగా, హరిశ్చంద్రుడిగా పౌరాణిక పాత్రల్లో మెప్పిస్తూనే ఎన్నో సందేశాత్మక సాంఘిక నాటకాలు రచించి యువనటులకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. రామగోవిందు మాట్లాడుతూ సురభి వంటి సంస్థలు దేశ విదేశాల వారితో పోటీ పడ్డాయని, అనంత కళాకారులు జాతీయ అంతర్జాతీయ స్థాయిల్లో రాణిస్తున్నారని చెప్పారు. మరుగునపడిపోతున్న నాటక రంగ కళకు కొద్దిపాటి మెలకువలతో పూర్వవైభవాన్ని తేవచ్చని తులనాత్మక అధ్యయనం ద్వారా తెలుసుకున్నట్టు తెలిపారు.

నేడు తగరకుంటలో జగనన్న ఆరోగ్య సురక్ష

కనగానపల్లి: మండలంలోని తగరకుంట గ్రామంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఈఓఆర్డీ అనిల్‌కుమార్ తెలిపారు. స్థానిక గ్రామ సచివాలయం వద్ద ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తారన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎం.బండమీదపల్లిలో .....

రాప్తాడు: మండలంలోని ఎం.బండమీదపల్లి గ్రామంలో శనివారం గ్రామ సచివాలయం దగ్గర జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాల్మన్, వైద్యాధికారి శివకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ డ్రైవర్లు

గుంతకల్లుటౌన్: స్థానిక ఆర్టీసీ డిపో డ్రైవర్లు జీవన్‌బాబు, డేవిడ్‌రాజు నిజాయితీ చాటుకున్నారు. వివరాలు.. గురువారం గుంతకల్లు నుంచి బెంగళూరుకు వెళ్లిన ఏపీ02 జడ్ 0351 బస్సులో అనంతపురానికి చెందిన ఆర్.భాస్కర్ అనే వ్యక్తి ప్రయాణించాడు. రూ.40 వేలు విలువ చేసే కెమెరా బ్యాగును బస్సులోనే మరిచిపోయి అనంతపురంలో దిగేశాడు. బ్యాగును గుర్తించిన డ్రైవర్లు శుక్రవారం రోజున సదరు ప్రయాణికుడు చిరునామా తెలుసుకుని స్థానిక ఆర్‌టీసీ డిపోలో డిప్యూటీ సీఎంఈ మోహన్, డీఎం నారాయణస్వామిల సమక్షంలో కెమెరా, బ్యాగును భాస్కర్‌కు అందజేశారు.



డిప్యూటీ సీఎంఈ సమక్షంలో కెమెరాను అందిస్తున్న డ్రైవర్లు జీవన్, డేవిడ్

● కమనీయం.. సుబ్రహ్మణ్యుడి కల్యాణం



అలంకరణలో శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

ఆత్మకూరు: షష్ఠి సందర్భంగా మండలంలోని పంపనూరు గ్రామంలో సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామివార్ల కల్యాణాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. దేవసేన, శ్రీవల్లి సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. పసుపు, కుంకుమ కలిపిన అక్షింతలతో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య మంగళవాయిద్యాలతో కల్యాణం నిర్వహించారు. అనంతరం స్వామి వారి మూల విరాట్‌కు పంచామృతాభిషేకాలు నిర్వహించి విశేష పూజలు జరిపించారు. మహా మంగళహారతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

నేడు సంతాప సభ

అనంతపురం కల్చరల్: మహాబోధి సాహిత్య వేదిక ఆధ్వర్యంలో సాహితీవేత్త జూపల్లి ప్రేమ్‌చంద్ సంతాప సభ శనివారం ఉదయం 10 గంటలకు ఆర్ట్స్‌కాలేజీలోని ఎనిమిదో నంబర్ గదిలో జరుగుతుందని నిర్వాహకుడు కృష్ణమూర్తి తెలిపారు. ఆయన సన్నిహితులందరూ విచ్చేయాలని కోరారు.

రేపటి నుంచి సీపీఎం ప్రజాగర్జన భేరి

అనంతపురం అర్బన్: జిల్లా సమగ్రాభివృద్ధికి సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి నవంబరు 9 వరకు ప్రజాగర్జన భేరి నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ తెలిపారు. శుక్రవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో పార్టీ సభ్యుడు శ్రీనివాసులు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. రాంభూపాల్ మాట్లాడుతూ జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యామ్నాయ విధానాలను రూపొందించి అమలు చేయాలన్నారు. ఇందు కోసం ఈ నెల 22 నుంచి 27 వరకు సంతకాల సేకరణ, 29న ‘జిల్లా సమగ్రాభివృద్ధి– ప్రత్యామ్నాయ విధానాలు’ అనే అంశంపై సెమినార్, నవంబరు 1, 2 తేదీల్లో తాడిపత్రి, గుత్తి, అనంతపురం, రాప్తాడు నియోజకవర్గాల్లో బస్సుయాత్ర, నవంబరు 6 నుంచి 9వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా స్కూటర్ యాత్ర నిర్వహించనున్నామన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నల్లప్ప, బాలరంగయ్య, సావిత్రి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దక్షిణ కాలువకు నీరు విడుదల



గార్లదిన్నె: మండలంలోని మిడ్ పెన్నార్ డ్యాం నుంచి శుక్రవారం దక్షిణ కాలువకు నీరు విడుదల చేసినట్లు హెచ్చెల్సీ ఏఈ సురేంద్ర తెలిపారు. ఈసందర్భంగా ఏఈ మాట్లాడుతూ తుంగభద్ర డ్యాంలో నీటి లభ్యత తగ్గిపోవడంతో మిడ్ పెన్నార్ డ్యాంకు రోజుకు 500 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో, సౌత్ కెనాల్‌కు 500 క్యూసెక్కులు అవుట్‌ఫ్లో ఉందన్నారు. ప్రస్తుతం డ్యాంలో 1.4టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. ఉన్నతాధికారుల సూచన మేరకు భూగర్భజలాల పెంపు కోసం నీరు అందిస్తున్నామన్నారు.



సినిమా తర్వాత సినిమా... ఒకేసారి రెండు లేక మూడు సినిమాలు చేసే హీరోయిన్లు హఠాత్తుగా కొత్త సినిమా సైన్ చేయకపోతే? 'వాట్ నెక్ట్స్' అనే ప్రశ్న ఎదురవుతుంది. ఆ నాయికలు ఇతర భాషల్లో సినిమాలు చేస్తున్నప్పటికీ డైరీలో తెలుగు సినిమా లేకపోవడం ఫ్యాన్స్‌ని నిరుత్సాహ పరిచే విషయం. ప్రస్తుతం తెలుగులో సినిమా సైన్ చేయని నాయికల గురించి తెలుసుకుందాం.

• అనుష్క • సమంత • రకుల్ • కృతీ శెట్టి

వాట్ నెక్ట్స్

గ్యాప్ లేకుండా...

అటు కమర్షియల్ చిత్రాల్లో హీరోయిన్‌గా, ఇటు లేడీ ఓరియంటెడ్ చిత్రాలతో ఆకట్టుకున్న అనుష్క జోరు గతంతో పోలిస్తే ప్రస్తుతం తగ్గిందనే చెప్పాలి. ఏడాదికి ఐదారు తెలుగు సినిమాలు చేసిన ఆమె ప్రస్తుతం ఏడాదికి ఒక్క సినిమాతోనే సరిపెట్టుకుంటున్నారు. 2021, 2022లో అయితే అనుష్క కనీసం ఒక్క తెలుగు సినిమాలోనూ నటించలేదు. ఈ ఏడాది నవీన్ పొలిశెట్టి, అనుష్క జంటగా నటించిన 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' సెప్టెంబర్ 7న విడుదలై, హిట్‌గా నిలిచింది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇక నాన్‌స్టాప్‌గా సినిమాలు చేస్తానని, తెలుగులో గ్యాప్ లేకుండా ప్రాజెక్ట్స్ కమిట్ అవుతానని అన్నారు అనుష్క. ప్రస్తుతం 'కథనార్– ది వైల్డ్ సోర్సెరర్' చిత్రంతో మలయాళ ఇండస్ట్రీలో అడుగు పెడుతున్నారు. అయితే తెలుగులో కొత్త సినిమా ఏదీ సైన్ చేయలేదు.

సంవత్సరం విరామం

దక్షిణాదిలో స్టార్ హీరోయిన్‌గా దూసుకెళుతున్న సమంత సంవత్సరం పాటు సినిమాలకు గ్యాప్ ఇచ్చిన విషయం తెలిసిందే. 'మయోసైటిస్' వ్యాధి బారిన పడిన ఆమె కొన్నాళ్ల పాటు షూటింగ్స్‌కి దూరంగా ఉంటూ చికిత్స తీసుకుని సినిమాలు చేశారు. ఇక సమంత ఫుల్ స్పీడ్‌తో సినిమాలు చేస్తారని ఆశించిన ఆమె అభిమానుల ఆనందం ఆవిరి అయ్యేట్లు ఏడాది పాటు తాను సినిమాలకు గ్యాప్ ఇస్తున్నట్లు ప్రకటించారు సమంత. మయోసైటిస్ పూర్తి స్థాయి చికిత్స కోసమే సమంత ఈ బ్రేక్ తీసుకున్నారనే వార్తలు వస్తున్నాయి. కాగా విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటించిన 'ఖుషి' చిత్రం సెప్టెంబరు 1న విడుదలై, మంచి హిట్‌గా నిలిచింది. 'ఖుషి' వంటి హిట్ మూవీ తర్వాత సమంత నటించనున్న తెలుగు సినిమా ఏంటి? అన్నదానిపై ఎలాంటి స్పష్టత లేదు. ఇకపోతే హిందీలో సమంత లీడ్ రోల్‌లో నటించిన 'సిటాడెల్' వెబ్ సిరీస్, 'చెన్నయ్ స్టోరీస్' (ఇంగ్లీష్–తమిళ్) చిత్రం విడుదలకు సిద్ధంగా ఉన్నాయి.

రెండేళ్లు గ్యాప్

సౌత్‌లో స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగారు రకుల్ ప్రీత్‌సింగ్. తెలుగులో వరుస చిత్రాలతో తన సత్తా చాటిన ఈ బ్యూటీ రెండేళ్లుగా ఒక్క తెలుగు సినిమా కూడా చేయకపోవడం విశేషం. క్రిష్ దర్శకత్వం వహించిన 'కొండపొలం' చిత్రంలో నటించారు రకుల్. 2021 అక్టోబర్ 8న ఆ సినిమా విడుదలైంది. ఆ తర్వాత మరో తెలుగు సినిమా చేయలేదు రకుల్. బాలీవుడ్‌కి పరిమితమై వరుసగా హిందీ సినిమాలు చేస్తున్నారామె. ప్రస్తుతం ఆమె బాలీవుడ్‌లో 'ఐ లవ్ యు', 'మేరీ పత్నీ కా రీమేక్' చిత్రాలతో పాటు తమిళంలో 'అయలాన్, ఇండియన్ 2' చిత్రాలు చేస్తున్నారు. అయితే రెండేళ్లుగా కనీసం ఒక్క తెలుగు సినిమా కూడా చేయకపోవడంతో ఆమె ఫ్యాన్స్ నిరుత్సాహపడుతున్నారు. కనీసం వచ్చే ఏడాది అయినా ఈ బ్యూటీ తెలుగులో తన జోరు చూపిస్తారేమో చూడాలి.

కొత్త సినిమా ఎప్పుడు?

తెలుగు పరిశ్రమలోకి 'ఉప్పెన'లా దూసుకొచ్చారు కృతీ శెట్టి. తొలి సినిమా 'ఉప్పెన '(2021) తో బేబమ్మగా తెలుగు ప్రేక్షకుల మనసులను దోచారీ బ్యూటీ. గత ఏడాది (2022) కృతీ శెట్టి నటించిన 'బంగార్రాజు, ది వారియర్, మాచర్ల నియోజకవర్గం, ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి' సినిమాలు రిలీజయ్యాయి. ఈ ఏడాది ఆమె నటించిన తెలుగు చిత్రం 'కస్టడీ' ఒక్కటే రిలీజ్ అయింది. ఆ చిత్రం విడుదలై ఆర్నెల్లు దాటినా మరో తెలుగు సినిమా సైన్ చేయలేదు కృతి. తెలుగులో మోస్ట్ హ్యాపెనింగ్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకున్న ఈ బ్యూటీ ప్రస్తుతం మలయాళంలో 'అజయంతే రండం మోషణం', తమిళంలో 'జెనీ' సినిమాలు చేస్తున్నారు. మరి.. కృతీ డైరీలో కొత్త తెలుగు సినిమా చేరేది ఎప్పుడు?

ఈ ఏడాది 'దసరా, భోళా శంకర్' సినిమాలతో ప్రేక్షకులను అలరించారు కీర్తీ సురేశ్. ఆ చిత్రాల తర్వాత మరో తెలుగు సినిమా అంగీకరించని కీర్తి తమిళంలో నాలుగు సినిమాలు చేస్తున్నారు. ఆమె నటించనున్న తదుపరి తెలుగు సినిమా ఏంటి? అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది. అదే విధంగా గత ఏడాది విడుదలైన 'ఆచార్య' సినిమా తర్వాత మరో తెలుగు సినిమా ఒప్పుకోలేదు పూజా హెగ్డే. మహేశ్‌బాబు 'గుంటూరు కారం'లో హీరోయిన్‌గా ఎంపికైనా ఎందుకనో ఆ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నారీ బ్యూటీ. అలాగే 'నన్ను దోచుకుందువటే' (2018) సినిమాతో టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన నభా నటేశ్ ఆ తర్వాత వరుసగా తెలుగు చిత్రాలు చేశారు. అయితే 'మాస్ట్రో' (2021) తర్వాత ఇప్పటివరకూ ఆమె మరో తెలుగు సినిమాపై ఎలాంటి సమాచారం లేదు. అదే విధంగా మెహరీన్, నిధీ అగర్వాల్, అనూ ఇమ్మాన్యుయేల్ వంటి హీరోయిన్ల జోరు కూడా తెలుగులో తగ్గింది. మెహరీన్ ఈ ఏడాది 'స్పార్క్' (తెలుగు–తమిళ్) లో నటిస్తున్నారు. ఆ తర్వాత ఆమె నటించే తెలుగు సినిమాపై క్లారిటీ లేదు. అలాగే ఈ ఏడాది ఏప్రిల్‌లో రిలీజైన 'రావణాసుర' చిత్రం తర్వాత అనూ ఇమ్మాన్యుయేల్ ఏ తెలుగు సినిమాలోనూ నటించడం లేదు. అలాగే నిధీ అగర్వాల్ చేతిలోనూ 'హరి హర వీరమల్లు' మినహా మరో తెలుగు సినిమా లేదు. ఈ సినిమా ఎప్పుడో ఒప్పుకున్నారామె. అయితే షూటింగ్ ఆలస్యం అవుతోంది. ఈ చిత్రం తర్వాత వేరే ఏ తెలుగు సినిమా కూడా ఆమె కమిట్ కాలేదు.



• కీర్తీ సురేశ్ • పూజా హెగ్డే • నభా నటేశ్ • నిధీ అగర్వాల్ • మెహరీన్ • అనూ ఇమ్మాన్యుయేల్



• అశోక్ వర్ధన్, సునీల్ బలుసు, విజయశాంతి, కల్యాణ్ రామ్, సయీ మంజ్రేకర్, ప్రదీప్ చిలుకూరి

కొత్త సినిమా షురూ

కల్యాణ్ రామ్ హీరోగా కొత్త సినిమాకి కొబ్బరికాయ కొట్టారు. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సయీ మంజ్రేకర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. నటి విజయశాంతి కీలక పాత్ర పోషిస్తున్నారు. ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్‌పై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మిస్తున్న ఈ సినిమా శుక్రవారం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి మురళీ మోహన్ కెమెరా స్విచ్చాన్ చేయగా, విజయశాంతి క్లాప్ కొట్టారు. ముప్పా వెంకయ్య చౌదరి స్క్రిప్ట్‌ని దర్శకునికి అందించారు. ''భారీ బడ్జెట్, అత్యున్నత సాంకేతిక విలువలతో రూపొందుతున్న చిత్రమిది. కల్యాణ్ రామ్ పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుంది. ఆయన కెరీర్‌లో ఈ సినిమా ఓ మైలురాయిగా నిలిచిపోతుంది. త్వరలోనే ఇతర నటీనటులు, పూర్తి వివరాలను తెలియజేస్తాం'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: బి. అజనీష్ లోక్‌నాథ్, కెమెరా: సి. రామ్ ప్రసాద్.

అనుకున్నవన్నీ జరగవు



• 'అల్లరి' నరేశ్, శ్రీరామ్

శ్రీరామ్ నిమ్మల, కలపాల మౌనిక జంటగా నటించిన చిత్రం 'అనుకున్నవన్నీ జరగవు కొన్ని'. జి. సందీప్ దర్శకత్వంలో శ్రీ భరత్ ఆర్ట్స్ సంస్థ నిర్మించిన ఈ చిత్రం నవంబర్ 3న రిలీజ్ కానుంది. ఈ చిత్రం పోస్టర్‌ను హీరో 'అల్లరి' నరేశ్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''పోస్టర్ ఆసక్తికరంగా ఉంది. నేను నటించిన 'సిల్లీ ఫెలోస్' చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేసిన సందీప్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవడం ఆనందంగా ఉంది'' అన్నారు. జి. సందీప్ మాట్లాడుతూ– ''క్రైమ్ కామెడీ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రమిది. కామెడీని ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తారు'' అన్నారు. ''నరేశ్‌గారు క్రైమ్, కామెడీ జానర్ చిత్రాలు ఎన్నో చేశారు. మా టైటిల్ లాంచ్ చేయడానికి ఆయనే కరెక్ట్ అనిపించింది'' అన్నారు శ్రీరామ్ నిమ్మల. ఈ చిత్రానికి కెమెరా: చిన్నా రామ్, జీవీ అజయ్, సంగీతం: గిడియన్ కట్ట, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: బీవీ నవీన్.

బేబి కాంబో రిపీట్



• ఆనంద్, వైష్ణవీ చైతన్య

'**బేబి**' సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న హీరో ఆనంద్ దేవరకొండ, హీరోయిన్ వైష్ణవీ చైతన్య కాంబినేషన్‌లో మరో సినిమా రూపొందనుంది. 'బేబి' చిత్ర దర్శకుడు సాయి రాజేశ్ ఈ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లే, మాటలు అందిస్తున్నారు. ఈ చిత్రం ద్వారా రవి నంబూరి దర్శకునిగా పరిచయం అవుతున్నారు. అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్‌పై ఎస్‌కేఎన్, సాయి రాజేశ్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ''ఈ సినిమా ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. త్వరలోనే షూటింగ్ మొదలవుతుంది. వచ్చే వేసవిలో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం. మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: విజయ్ బుల్గానిన్, కెమెరా: బాల్ రెడ్డి, సహనిర్మాత: ధీరజ్ మొగిలినేని.

ఫలితం ఆశించకుండా సేవలు అందించాలి



మెడికల్ కళాశాల ఫ్రెషర్స్‌డే సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జేఎన్‌టీయూ వీసీ రంగా జనార్దన తదితరులు



విద్యార్థికి జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం

• జేఎన్‌టీయూఏ వీసీ రంగ జనార్దన

అనంతపురం మెడికల్: వైద్యవృత్తి గౌరవప్రదమైనదని, ఫలితం ఆశించకుండా సేవలు అందిస్తేనే గుర్తింపు వస్తుందని జేఎన్‌టీయూఏ వీసీ రంగ జనార్దన పేర్కొన్నారు. శుక్రవారం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఆగ్నేయ –23 ఫ్రెషర్స్ డేకు జేఎన్‌టీయూ వీసీ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మొదటగా జ్యోతిప్రజ్వలన చేసి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి చెరక, హిప్పోక్రేట్స్ ఓత్‌ను నూతనంగా వైద్య విద్యలో ప్రవేశించిన విద్యార్థులతో చదివించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు మాట్లాడుతూ 2000లో ప్రారంభమైన వైద్య కళాశాలలో యూజీ, పీజీ సీట్లతో పాటు మౌలిక సదుపాయాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలోనే అనంతపురం వైద్య కళాశాలకు గుర్తింపు వచ్చిందన్నారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బోధనాస్పత్రికి 550 పడకలు మంజూరైన రోజూ 1300 వరకు అడ్మిషన్‌లో ఉంటూ రోగులకు సేవలందిస్తున్నామన్నారు. అనంతరం జేఎన్‌టీయూ వీసీ, ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ విద్యార్థులకు గుర్తింపు కార్డులు, బహుమతులను అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ సుబ్రమణ్యం, డాక్టర్ షారోన్, డాక్టర్ ఆత్మారాం, గైనిక్ హెచ్‌ఓడీ డాక్టర్ షంషాద్‌బేగం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, తదితరులు పాల్గొన్నారు. ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు: వైద్య కళాశాలలో ఫ్రెషర్స్ డే సందర్భంగా నూతన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. సినిమా పాటలకు స్టెప్పులు వేశారు. అంతకుముందు ఫ్రెషర్స్ డేని పురస్కరించుకొని విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో కనిపించారు. విద్యార్థులు సెల్ఫీలు తీసుకొని ఆనందాన్ని పంచుకున్నారు.





సినిమా పాటలకు డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు


మోటార్ రివైండింగ్, టూ వీలర్ మెకానిక్ శిక్షణ

అనంతపురం: రూడ్‌సెట్ సంస్థలో నిరుద్యోగులకు ఎలక్ట్రికల్ మోటార్ వైండింగ్, టూవీలర్ మెకానిక్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు డైరెక్టర్ ఎస్. విజయలక్ష్మి ఓ ప్రకటనలో తెలిపారు. నవంబర్ 13 నుంచి 30 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణలో భాగంగా ఉచిత భోజనం, ఉచిత వసతి కల్పిస్తామన్నారు. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగ యువత అర్హులన్నారు. ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ బుక్ కలిగి ఉండి, 19 నుంచి 45 ఏళ్ల వయస్సులోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు సెల్: 9618876060, 9440905479లో సంప్రదించాలన్నారు.

29న బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

అనంతపురం: అనంతపురం ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఈ నెల 29న సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ పురుషులు, మహిళల జట్లను ఎంపిక చేయనున్నట్లు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మొహిద్దీన్, ఈశ్వరయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం పది గంటల్లోపు హాజరుకావాలని సూచించారు. ఎంపికయ్యే జట్లు ఈ ఏడాది డిసెంబర్‌లో అనంతపురంలో నిర్వహించే అంతర జిల్లాల పోటీల్లో పాల్గొంటాయని తెలిపారు.

గుంతకల్లుకు చేరిన ఆర్‌పీఎఫ్ సైకిల్ ర్యాలీ



ఆర్‌పీఎఫ్ సైకిల్ ర్యాలీకి స్వాగతం పలుకుతున్న దృశ్యం

గుంతకల్లు: ఆర్‌పీఎఫ్‌ల సైకిల్ ర్యాలీ శుక్రవారం గుంతకల్లుకు చేరింది. అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఆర్‌పీఎఫ్‌ల సైకిల్ ర్యాలీ ఈనెల 17న హైదరాబాదులోని ఆర్‌పీఎఫ్ హెడ్‌క్వార్టర్‌లో ఆర్‌పీఎఫ్ ఐజీ ఆరోమా సింగ్ ఠాకూర్ ప్రారంభించారు. దాదాపు 10 మంది టీమ్‌తో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సైకిల్ ర్యాలీలో ఆర్‌పీఎఫ్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ టీమురళీకృష్ణ, డీఎంఎం వెంకటేశ్వరరావు, గుంతకల్లుకు చెందిన ఆర్థో సర్జన్ డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, సీఐటీ ఐపీఎఫ్‌లు కే బెనయ్య, ఐపీఎఫ్ రమేష్‌గౌడ్, ఫిజికల్ డైరెక్టర్ గోపీ, రైల్వే ఉద్యోగి ముజాఫర్, ఎస్ఐపీఎఫ్ కిరణ్, ఏఎస్ఐలు అబ్రమ్, కుమార్ పాల్గొన్నారు. సైకిల్ ర్యాలీకి జీఆర్‌పీ ఎస్పీ కే చౌడశ్వరి, ఇతర అధికారులు స్వాగతం పలికారు. ఈ ర్యాలీ ఆర్‌పీఎఫ్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

దశలవారీగా రైల్వే స్టేషన్ అభివృద్ధి



మాట్లాడుతున్న సీనియర్ డీసీఎం మనోజ్, చిత్రంలో స్టేషన్ మేనేజర్ అశోక్‌కుమార్, ఉద్యోగులు

అనంతపురం సిటీ: పెరిగిన జనాభా, రైళ్ల రద్దీకి అనుగుణంగా అనంతపురం రైల్వే స్టేషన్ దశలవారీగా అభివృద్ధి చెందుతోందని గుంతకల్లు రైల్వే డివిజన్ సీనియర్ డీసీఎం మనోజ్ అన్నారు. శుక్రవారం అనంతపురం రైల్వే స్టేషన్ ఆవిర్భావ వేడుకలు కొత్తగా నిర్మించిన ఎస్ఆర్ఎం కార్యాలయంలో రైల్వే స్టేషన్‌లో మేనేజర్ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. తొలుత కేక్ కట్‌చేసి అందరికీ పంపిణీ చేశారు. అనంతపురం రైల్వే స్టేషన్ 1892లో ఏర్పాటైనట్లు డీసీఎం తెలిపారు. అప్పటి నుంచి అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూ వస్తోందన్నారు. డబ్లింగ్ లైన్, విద్యుదీకరణ, ప్రయాణికుల అభిరుచికి అనుగుణంగా స్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. రూ.కోట్లతో మోడల్ స్టేషన్‌గా తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు.

కార్యక్రమంలో రైల్వే రిటైర్డ్ ఉద్యోగులు అంజినాయక్, ఆనందరాజు, రంగస్వామి, గోవిందరాజులు, జీవానందం సహా అన్ని విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రత్యేక పిల్లలకు సేవ చేయడం అదృష్టం



నియామక పత్రం అందిస్తున్న డీఈఓ నాగరాజు

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సేవ చేయడం అదృష్టమని జిల్లా విద్యాశాఖ అధికారి, సమగ్రశిక్ష ఏపీసీ వి.నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగంలోని రీసోర్స్‌పర్సన్ పోస్టులు భర్తీ చేశారు. ఎంపికైన వారికి సమగ్రశిక్ష కార్యాలయంలో నియామక పత్రాలు అందించారు. ఎంఆర్, హెచ్ఐ/వీఐ విభాగాలకు చెందిన మొత్తం 42 పోస్టులు భర్తీ చేశారు. డీఈఓ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల పిల్లల కోసం ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా భవిత కేంద్రాలు నడుస్తున్నాయన్నారు. ఈ నెల 25న ఆయా స్థానాల్లో జాయిన్ కావాలని సూచించారు. కార్యక్రమంలో వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ అబ్దుల్ రసూల్, సమగ్ర శిక్ష కార్యాలయం పర్యవేక్షకుడు సునీల్‌కుమార్, ఐఈడీ అనంతపురం, సత్యసాయి జిల్లాల కోఆర్డినేటర్లు షమ, ఆనంద్ బాబు, ఏఎంఓ చంద్రశేఖర్ రెడ్డి, సీఎంఓ గోపాలకృష్ణ, సీనియర్ అసిస్టెంట్ పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

కరువు నేలపై కనికరం లేని చంద్రబాబు

• అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కేవీ రమణ

రాప్తాడురూరల్: కరువు నేలపై చంద్రబాబుకు కనికరం లేదని అభివృద్ధి వికేంద్రీకరణ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కేవీ రమణ మండిపడ్డారు. శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కరువు సీమ ఎత్తిపోతల పథకాలైన హంద్రీనీవా, గాలేరు–నగరి ప్రాజెక్టులకు నీరు పంపింగ్ చేయాలంటే శ్రీశైలం ప్రాజెక్టులో 854 అడుగుల నీటిమట్టం ఉండాలన్నారు. ఇందుకోసం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జీఓ తీసుకొస్తే వ్యతిరేకంగా కృష్ణా బ్యారేజీపై ధర్నా చేసింది ఎవరు? అని ప్రశ్నించారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం 80 వేల క్యూసెక్కులకు పెంచాలన్నప్పుడు ప్రకాశం జిల్లా టీడీపీ ప్రజా ప్రతినిధులతో వ్యతిరేకంగా ప్రకటనలు ఇప్పించింది ఎవరు? అని మండిపడ్డారు. 2003లో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు అప్పర్ భద్ర ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయని అధికారులు తెలియజేస్తే నిమ్మకు నీరెత్తినట్లు ఎవరు ఉండిపోయారో రాష్ట్రానికే తెలుసునన్నారు.

బహిరంగ చర్చకు సిద్ధమా..?

కరువు సీమ కష్టాల సీమగా మారడానికి 14 ఏళ్లు పాలించిన చంద్రబాబు కారణమా? నాలుగేళ్లు పాలించిన వైఎస్ జగన్ కారణమా? అనే అంశంపై బహిరంగ చర్చకు సిద్ధమా అని కేవీ రమణ సవాల్ విసిరారు. నిజాలు చెబితే చంద్రబాబు తల, సత్యాలు రాస్తే రామోజీ, రాధాకృష్ణ తలలు వేయి ముక్కలైపోతాయని ముని శాపం అన్నారు. అందుకే రాయలసీమపై కనికట్టు కథనాలు అని మండిపడ్డారు. రైతుల ఆత్మహత్యలు, అక్రమ సంబంధాల హత్యలుగా చిత్రీకరించింది ఎవరు? టీడీపీ హయాంలో ఎక్కువ జరిగాయా? వైఎస్సార్‌సీపీ హయాంలో ఎక్కువ జరిగాయో బహిరంగంగా చర్చిద్దామా? అన్నారు. జగన్ జనరంజక పాలనను చూసి ఓర్వలేక తాము చేసిన ద్రోహాలను కప్పిపుచ్చుకోవడానికి పచ్చ మీడియా రాస్తున్నది, చెబుతున్నది పిచ్చి రాతలు, మత్తు కూతలే అని కేవీ రమణ విమర్శించారు.

జూపల్లి మరణం తీరని లోటు

అనంతపురం కల్చరల్: ప్రముఖ రచయిత జూపల్లి ప్రేమ్‌చంద్ మరణం తెలుగు సాహితీ లోకానికి తీరని లోటని పలువురు జిల్లా రచయితలు, సాహితీ సంస్థల ప్రతినిధులు శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. 2012లో అంతర్జాతీయ తెలుగు మహాసభలు జరిగిన సమయంలో అనంత కవిత, అనంత వ్యాసం అనే సంపుటాలకు జూపల్లి సంపాదకత్వం వహించి అస్తిత్వవాదానికి మరింత దగ్గరయ్యాడని కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ రాచపాలెం చంద్రశేఖరరెడ్డి గుర్తు చేశారు. సీనియర్ రచయితలు డాక్టర్ శాంతినారాయణ, తరిమెల అమరనాథరెడ్డి, జూటూరు షరీఫ్, బాలగొండ ఆంజనేయులు, జెట్టి జైరామ్, ఉప్పరపాటి వెంకటేష్, ఆనంద్, సురేష్, అనంత జిరసం అధ్యక్ష కార్యదర్శులు శ్రీహరిమూర్తి, తోట నాగరాజు, శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా హరి, బిక్కి కృష్ణ, డాక్టర్ ఉమర్‌ఆలీషా సాహితీసమితి అధ్యక్షుడు రియాజుద్దీన్, టీవీ రెడ్డి, అశ్వర్థరెడ్డి, నాగేంద్ర, విప్లవగాయకుడు దాసరి ఆదినారాయణ తదితరులు జూపల్లితో తమకున్న సాహిత్య అనుబంధాన్ని స్మరించుకున్నారు.

జేఎన్‌టీయూ (ఏ)లో ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఆమోదం

• త్వరలోనే నోటిఫికేషన్

అనంతపురం: జేఎన్‌టీయూ(అనంతపురం)లో ఖాళీగా ఉన్న అసిస్టెంట్, అసోసియేట్, ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. ఇందుకు సంబంధించిన గెజిట్‌ను గురువారం జారీ చేసింది. వర్సిటీలో పోస్టుల భర్తీకి హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్) కూడా పూర్తయ్యింది. ఎన్ని పోస్టులు భర్తీ చేస్తారనే అంశంపై స్పష్టత వచ్చింది. మొత్తం 203 పోస్టులను యుద్ధప్రాతిపదికన భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు వర్సిటీ త్వరలోనే ప్రత్యేక నోటిఫికేషన్ జారీ చేయనుంది. ఎస్కేయూ సైతం ఇదే తరహాలోనే నోటిఫికేషన్ ఇవ్వనుంది. రాత పరీక్షను ఏపీపీఎస్సీ నిర్వహిస్తుంది. ఇందులో మెరిట్ వచ్చిన వారికి ఆయా వర్సిటీల పరిధిలోనే ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు.

జేఎన్‌టీయూ(ఏ)లో భర్తీ చేయనున్న పోస్టుల వివరాలు

పోస్టు రకం	అసిస్టెంట్ ప్రొఫెసర్	అసోసియేట్ ప్రొఫెసర్	ప్రొఫెసర్
రెగ్యులర్ టీచింగ్	157	16	07
రెగ్యులర్ అకడమిక్	00	00	00
నాన్ టీచింగ్	04	00	00
బ్యాక్‌లాగ్ వేకెన్సీస్	03	16	00
మొత్తం	164	32	07

సాక్షి ఫ్యామిలీ

అనంతపురం

శనివారం ॥ 21-10-2023

V

ప్రమాదమా..? టాన్యా ఉందిగా..!

కాస్త ఖాళీ సమయం దొరికినప్పుడు... సెలవుల్లో స్నేహితులతో కలసి ట్రెక్కింగ్‌కు వెళ్తుంటారు చాలామంది యువతీ యువకులు. అయితే అనుకోకుండా ఏదైనా ప్రమాదంలో చిక్కుకుంటే వారిని ఎవరు కాపాడతారు? అందుకే అలాంటి వారికి అండగా ఉంటోంది టాన్యా. అవును, సరదాగా గడపాల్సిన వయసులో ఇతరుల ప్రాణాలను రక్షిస్తోంది టాన్యా కోలి. ఐదోఏటి నుంచే కొండలు ఎక్కడం నేర్చుకుని, టీనేజ్‌లోకి వచ్చినప్పటి నుంచి ఏకంగా రెస్క్యూ టీమ్‌ను నిర్వహిస్తూ ఎంతోమందిని ఆపదల నుంచి బయటపడేసింది. పెద్ద పెద్ద కొండలను అవలీలగా ఎక్కేస్తూ, మరొకరికి సాయంగా నిలబడుతూ.. నేటి యువతరానికి స్ఫూర్తిగా నిలుస్తోంది టాన్యా.



నాసిక్‌కు చెందిన టాన్యా కోలి ఐదేళ్ల వయసు నుంచే పర్వతాలు ఎక్కడం నేర్చుకోవడం మొదలు పెట్టింది. టాన్యా తండ్రి దయానంద్ కోలి నాసిక్ క్లైంబర్స్ అండ్ రెస్క్యూయర్స్ అసోసియేషన్‌లో పని చేస్తుండడంతో తరచూ ట్రెక్కింగ్, రెస్క్యూ అనే పదాలను తండ్రి నోట వెంట వినేది. టాన్యాకూ ట్రెక్కింగ్ పైన ఆసక్తి ఏర్పడడంతో తండ్రి దగ్గర ట్రెక్కింగ్ ఎలా చేయాలో నేర్చుకుంది. అలా ట్రెక్కర్‌గా మారిన టాన్యా, రెస్క్యూటీమ్ కలిసి ఎంతోమందిని ప్రమాదాల నుంచి బయటపడేస్తోంది. తండ్రి దగ్గర నేర్చుకున్న ట్రెక్కింగ్ మెళకువలతోపాటు, హిమాలయాల్లో ప్రత్యేకమైన శిక్షణ కూడా తీసుకుంది. ప్రమాదంలో ఉన్న వారిని కాపాడడంతోపాటు, పర్వతారోహకులకు ట్రెక్కింగ్‌లో శిక్షణ ఇస్తోంది టాన్యా. పర్వతాన్ని అధిరోహించేటప్పుడు జరిగే ప్రమాదాలను ఎలా ఎదుర్కోవాలో కూడా నేర్పిస్తుంది. టాన్యా దగ్గర శిక్షణ తీసుకుంటున్నవారిలో మహారాష్ట్ర పోలీసు అకాడమీ ట్రెనీలు కూడా ఉన్నారు. ప్రతిసారీ తను అందుబాటులో ఉండడం కష్టం కాబట్టి ఇతరులకు నేర్పించడం ద్వారా ప్రమాద సమయంలో వారిని వారే కాపాడుకోవడంతోపాటు, ఇతరులను కూడా కాపాడగలరు. అందుకే మరింతమందికి రెస్క్యూలో శిక్షణ ఇస్తున్నాను అని టాన్యా చెబుతోంది.

‘‘ప్రమాదంలో ఉన్నారు, కాపాడాలి అని సమాచారం తెలిస్తే వెంటనే బయలుదేరతాం. అది అర్ధరాత్రి అయినా ఫస్ట్ ఎయిడ్ కిట్‌తో సిద్ధంగా ఉంటాం. ట్రెకింగ్ చేసేవారిని, ప్రమాదంలో ఉన్న వ్యక్తుల్ని రక్షించడం థ్రిల్లింగ్ ఇచ్చేదే అయినప్పటికీ చాలా సవాళ్లతో కూడుకున్నది. సమస్యలు ఉన్నప్పటికీ అవతలి వారిని ప్రమాదం నుంచి కాపాడగలిగామన్న సంతృప్తి ముందు ఆ సమస్యలు, సవాళ్లు చిన్నబోవలసిందే’’ అని చెబుతోంది తాన్యా. ●

న్యూస్‌మేకర్

కశ్మీర్ పేరు చెప్తే అందమైన ప్రదేశాలే గుర్తొస్తాయి. కాని ఆ లోయలో దాగిన రుచులు అన్వేషిస్తే తప్ప తెలియదు. శాకాహారమైనా మాంసాహారమైనా స్వచ్ఛమైన దినుసులతో గుమ్మెత్తిస్తారు. ‘మేము ఎలా వండుతామో నా వంట చూసి తెలుసుకోండి’ అని కశ్మీర్ వంట చేసి చూపుతోంది రుక్సార్ సయీద్. కశ్మీర్ మహిళలు పెద్దగా పాల్గొనని ‘మాస్టర్ షెఫ్ ఆఫ్ ఇండియా’ తాజా సిరీస్‌కు రుక్సార్ స్పెషల్ అట్రాక్షన్ అయ్యింది. పోటీని తట్టుకుని టాప్ 12లో నిలిచిన ఆమెను చూసి కశ్మీర్‌లో ఆడవాళ్లు గర్విస్తున్నారు.



రుక్సార్ సయీద్

టేస్ట్ ఆఫ్ కశ్మీర్

సోనీ లివ్‌లో ప్రసారమవుతున్న తాజా సీజన్ ‘మాస్టర్ షెఫ్ ఆఫ్ ఇండియా’ కోసం రుక్సార్ సయీద్ (33) ‘షబ్ దేక్’ అనే కశ్మీరీ వంట చేసింది. ‘ఇది మా అమ్మమ్మ నుంచి మా అమ్మకు, మా అమ్మ నుంచి నాకు అందిన వంట. ముదురు గుమ్మడికాయ, నాటుకోడి, ఆల్ బకారా ఎండుగుజ్జు వేసి చేస్తాం. చాలా బాగుంటుంది’ అంది. జడ్జీలుగా ఉన్న ప్రముఖ షెఫ్‌లు వికాస్ ఖన్నా, రణ్‌వీర్ బ్రార్, పూజా ధింగ్రా... కొద్దిగా రుచి చూసి ‘అద్భుతం’ అన్నారు. ఆమె ఇంకో ఎపిసోడ్‌లో ‘షికారా రైడ్’ అనే అల్పాహారం చేసింది. మటన్ కోఫ్తాను, పుదీనా మసాలాతో రంగరించి చేసింది. టేస్ట్ అదిరిందని వేరే చెప్పాలా?

‘కశ్మీర్ లోయంతా రకరకాల మసాలా దినుసులు, మేం మాత్రమే తినే ఆకుకూరలు, కాయగూరలు ఉన్నాయి. వాటిని వండే పద్ధతి అందరికీ తెలియదు. మాస్టర్ షెఫ్ ద్వారా దేశమంతటికీ ఆ రుచులను తెలియజేయాలనుకుంటున్నాను’ అంటుంది రుక్సార్ సయీద్.

ఆమె సంకల్పం గట్టిదిలాగుంది. తాజా సీజన్‌లో మహా మహా వంటగాళ్లు, వంటగత్తెలు పోటీ పడితే తుది జాబితాలో 22 మంది ఉంటే, వారిలో చాలామందిని అధిగమించి’ టాప్ 12కు చేరింది రుక్సార్. దాంతో కశ్మీర్‌లో ఇప్పుడు ఈ షోను అక్కడి స్త్రీలు చూస్తున్నారు. రుక్సార్‌ను తమ ప్రతినిధిగా, తమ సామర్థ్యాలకు కొలమానంగా చూస్తున్నారు. ‘ఆ సంతోషం చాలు నాకు. నన్ను స్ఫూర్తిగా తీసుకుని స్త్రీలు ముందుకు రావాలి’ అంటుంది రుక్సార్.



ఫుడ్ టెక్నాలజీలో డాక్టరేట్

రుక్సార్ సయీద్‌ది పుల్వామా జిల్లాలోని పామ్‌పోర్ అనే ప్రాంతం. నిత్యం మంచు కురిసే ఈ ప్రాంతంలో కవులు ఎక్కువ. ‘నేను కవిత్వం రాయను. కాని ప్లేట్‌లో పదార్థమే ఒక కవిత్వమంత అందంగా అమర్చగలను’ అంటుంది రుక్సార్. ఫుడ్ టెక్నాలజీలో పీహెచ్‌డీ చేసిన రుక్సార్ అందరిలా ఏ లెక్చరర్ పోస్ట్‌కో వెళ్లలేదు. ‘నాకు ఆహారం మీద సంపూర్ణ అవగాహన ఉంది. ముఖ్యంగా ఫ్రోజెన్ ఫుడ్‌ను సరిగా అమ్మగలిగితే తక్షణం వేడి చేసుకుని తినాలనుకునేవారికి మేలు జరుగుతుంది. కాని ఆహారంలో కల్తీ ఎక్కువ. ఈ కల్తీ విషంతో సమానం. అందుకే నేను ఏ కల్తీ లేని ఫ్రోజెన్ ఫుడ్‌ను అమ్మాలని ఖాలిస్ ఫుడ్స్ పేరుతో చిన్న సంస్థను మొదలుపెట్టాను. చికెన్ ఉత్పత్తులను కశ్మీర్‌లో అమ్ముతున్నాను. కశ్మీర్‌లో ఉద్యోగం చేయడం కన్నా ఉద్యోగాలు కల్పించడమే ఎక్కువ అవసరం అని నేను భావిస్తాను. నిరుద్యోగం పోవాలంటే ఇలాగే చేయాలి. నా సంస్థ బాగా నడుస్తోంది. కాని దేశవ్యాప్తంగా పంపాలంటే కొన్ని చిక్కులు ఉన్నాయి. ఈ లోపు నేను, నా బ్రాండ్ తెలియడానికి మాస్టర్ షెఫ్ ప్రోగ్రామ్‌కు వచ్చాను’ అని తెలిపింది రుక్సార్.

అంతే తేడా

‘వంట అందరు ఆడవాళ్లు చేస్తారు. కాని ఫుడ్ షోలలో ఆ వంటను శాస్త్రీయంగా చేయాలి. అంతే తేడా. కశ్మీర్‌లో వంట తెలిసిన యువతీ యువకులు బాగానే ఉన్నారు. నేను ఈ షో ద్వారా గడించిన అనుభవంతో వారికి సాయం చేయాలనుకుంటున్నాను. ఆహారం తయారు చేయడంలో మెళకువలు తెలిపి వారు ఫుడ్ జాయింట్‌లు ఏర్పాటు చేసుకుని తమ కాళ్ల మీద తాము నిలబడేలా చూడాలనుకుంటున్నాను. ఇందుకు కావాల్సిన సామాగ్రి నేనే సమకూరుస్తాను’ అంది. ఒక కొడుకు, ఒక కూతురు ఉన్న రుక్సార్ తన భర్త సాదిక్ అహ్మద్ సహకారం వల్లే ఇలా షోకు వచ్చినట్టుగా తెలిపింది. ‘ఆడవాళ్లు.. ప్రయత్నించండి. ఓడిపోవద్దు’ అనేది రుక్సార్ సందేశం.

బ్యూటిప్స్

కనుబొమలకు కలోంజీ





నల్లజీలకర్ర (కలోంజీ) విత్తనాలను పొడిచేయాలి. ఈ పొడిలో ఆలివ్ ఆయిల్, అలోవెరా జెల్‌ను వేసి చక్కగా కలపాలి. ఇప్పుడు తడి కాటన్ వస్త్రంతో కనుబొమలను శుభ్రంగా తుడిచి.. నల్ల జీలకర్ర మిశ్రమాన్ని ప్యాక్‌లా వేయాలి. ఇరవై నిమిషాలు ఆరాక కడిగేయాలి. కనుబొమ్మలను తడిలేకుండా తుడిచి కొద్దిగా ఆలివ్ ఆయిల్‌ను కనుబొమలపైన రాసి ఐదునిమిషాలపాటు మర్దన చేయాలి.

- ఈ ప్యాక్‌ను వారానికి మూడుసార్లు వేయడం వల్ల రక్తప్రసరణ చక్కగా జరిగి కనుబొమల మీద వెంట్రుకలు పెరుగుతాయి.
- నల్లజీలకర్ర ప్యాక్ పలుచటి కనుబొమలను ఒత్తుగా మారుస్తుంది. కనుబొమలు తీరైన ఆకృతిలో చక్కగా మెరుస్తాయి.
- కలోంజిలోని పోషకాలు కనుబొమల వెంట్రుకలు రాలకుండా చేస్తాయి.
- కనుబొమలు తెల్లబడడం మొదలైన వారు సైతం ఈ ప్యాక్‌ను వాడితే వెంట్రుకలు నల్లగా మారతాయి.



ఇప్సితా దాస్‌గుప్తా

● సందర్భం

ఆమె సక్సెస్ మంత్రా...
వ్యూహ చతురత వృత్తి నిబద్ధత

అనుభవం నేర్పిన పాఠాలు అద్భుత విజయాలను సొంతం చేస్తాయి.
రెండు దశాబ్దాలకు పైగా ఎన్నో కార్పొరేట్ కంపెనీలలో పని చేసిన ఈప్సితా దాస్‌గుప్తా ఎన్నో విలువైన పాఠాలను నేర్చుకుంది.
అమెరికాలో యాపిల్ సర్వీసెస్‌లో సీనియర్ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్‌గా విధులు నిర్వహించి మంచి పేరు తెచ్చుకుంది.
తాజాగా...
అమెరికన్ మల్టీ నేషనల్ ఐటీ కార్పోరేషన్ ‘హెచ్‌పీ ఇండియా’ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (ఎస్‌వీపీ), మేనేజింగ్ డైరెక్టర్‌గా నియామకం అయింది...

పనిలోని కష్టమే ఇష్టమైతే అంతకంటే సుఖం ఏమున్నది?

కొలంబియా యూనివర్శిటీలో మ్యాథ్స్, ఎకనామిక్స్‌లో డిగ్రీ, హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో ఎంబీఏ చేసిన ఈప్సితా ఎన్నో మల్టీ నేషనల్ కంపెనీలలో పనిచేసింది. ముంబై రోడ్లపై ఉరుకులు, పరుగులు, పని భారంతో నిద్రలేని రాత్రులు ఆమెకు కొత్తేమీ కాదు.

కుటుంబ జీవితాన్ని, వృత్తి జీవితాన్ని సమన్వయం చేసుకోడంలో సమస్యలు తలెత్తాయి.

‘నాకు కష్టంగా ఉంది’ అని మాత్రం ఎప్పుడూ అనుకోలేదు.

ఎన్నో కంపెనీలలో మార్కెటింగ్, స్ట్రాటజీ విభాగాలకు నేతృత్వం వహించి మన దేశంతో సహా బంగ్లాదేశ్, శ్రీలంకలలో పనిచేసింది ఈప్సితా. ఆఫీస్ గదికే పరిమితం కాకుండా జనాల్లోకి వెళ్లి క్లయింట్స్ అవసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండేది. వాటికి అనుగుణంగా వ్యూహాలను రూపొందించుకునేది.

యాపిల్‌కు ముందు స్టార్ ఇండియా ప్రెసిడెంట్ ఆఫ్ కార్పొరేట్ స్ట్రాటజీ, జనరల్ ఎలక్ట్రిక్ కంపెనీ దక్షిణ ఆసియా చీఫ్ కమర్షియల్ ఆఫీసర్‌గా పని చేసిన ఈప్సితా వృత్తికి సంబంధించి నిర్ణయాలు తీసుకునే ముందు ఒకటికి పదిసార్లు ఆలోచిస్తుంది. చిన్నాపెద్దా అనే తేడా లేకుండా అందరితో చర్చిస్తుంది.

‘తీసుకున్న నిర్ణయాలను వెనక్కి తీసుకోవచ్చునేమోగానీ, ఆ నిర్ణయం ఫలితంగా ఉత్పన్నమయ్యే పరిస్థితులను వెనక్కి తీసుకోలేదు. అందుకే ఒక నిర్ణయం తీసుకునే ముందు వంద కోణాల్లో ఆలోచిస్తాను’ అంటుంది ఈప్సితా.

‘మీకు ఇన్‌స్పిరేషన్ ఎవరు?’ అనే ప్రశ్నకు ఈప్సితా చెప్పే జవాబు...
‘వీరు వారు అని కాదు. నేను మాట్లాడే ప్రతి వ్యక్తి నుంచి ఎంతో కొంత ఇన్‌స్పైర్ అవుతుంటాను. సాధారణ ప్రజల నుంచి ఇన్వెస్టర్‌లు, లీడర్‌లు, ఆర్టిస్టుల వరకు నాకు ఎంతోమంది రోల్ మోడల్స్ కనిపిస్తారు’

ఉద్యోగంలోకి అప్పుడే వచ్చిన రోజుల్లో ఈప్సితాలాంటి కొత్త ఉద్యోగులకు సీనియర్‌ల నుంచి వినిపించిన మాట ‘ఇలా ఎవరైనా ఆలోచిస్తారా?’

అందరిలాగే ఈప్సితా ఆలోచించినట్లయితే ఆమెకు ఇంత పేరు వచ్చేది కాదేమో.

‘ఇలా కూడా చేయవచ్చు... అంటూ సంప్రదాయ విధానాలకు భిన్నంగా ఆలోచించేదాన్ని. ఇది సీనియర్‌లకు రుచించేది కాదు. అయితే నా ఆలోచనల్లో సత్తా ఉందని ఆ తరువాత నిరూపణ అయింది’ అంటుంది ఈప్సితా.

వృత్తిరీత్యా ఈప్సితా దాస్‌గుప్తా ఒక సమస్యకు పరిష్కారం వెదకగానే పని అక్కడితో ఆగిపోదు. ‘మేమున్నాం’ అంటూ కొత్త సమస్యలు పుట్టుకొస్తుంటాయి. గత సమస్యలతో వీటికి పోలిక ఉండకపోవచ్చు. కొన్నిసార్లు పరిష్కారం దుర్భేద్యంగా అనిపించవచ్చు. ఇలాంటి సమయంలోనే వ్యూహకర్తలు చురుగ్గా ఆలోచించాలి.

వ్యూహకర్తగా ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపిన ఈప్సితా దాస్‌గుప్తా ఎంతోమందికి రోల్ మోడల్‌గా నిలిచింది.



డాక్టర్ మురళీకృష్ణ

నేను జయించాను

వైద్యులు రోగులకు వైద్యం చేస్తారు. పేషెంట్ వ్యాధిని అంచనా వేసి, పరీక్షలతో నిర్ధారణకు వచ్చి, సిలబస్‌లో చదివిన సమాధానాలతో వైద్యం చేస్తారు. మరి... అప్పటివరకు లేని కొత్త రోగం వస్తే? చికిత్స కోసం అప్పటికే చదివిన సిలబస్‌లో సమాధానం ఎలా వెతకాలి? వైద్యవిద్యలో చెప్పని పాఠాల కోసం అన్వేషణ ఎలా మొదలు పెట్టాలి? అందుకే... ‘పేషెంట్‌లు, పరిశోధనలే నా గురువులు’ అన్నారు డాక్టర్ మురళీకృష్ణ. ఆయన ‘సాక్షి’తో మాట్లాడుతూ... నిర్ధారిత ప్రయోగాలు, నిరూపిత సమీకరణలతో వైద్యం చేయడానికే పరిమితం కాకూడదు. రోగికి అవసరమైన కొత్త సమీకరణాలను వైద్యులు సృష్టించగలగాలన్నారు. బ్రాండ్స్ ఇంపాక్ట్ సంస్థ విశేషంగా వైద్యసేవలందించిన వైద్యులను ఇటీవల న్యూఢిల్లీలో గౌరవించింది. పేదవారికి తక్కువ ఖర్చుతో వైద్యం అందిస్తూ ‘హెల్త్ కేర్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2023’ పురస్కారం అందుకున్నారు తెలుగు డాక్టర్ మురళీకృష్ణ.

మైక్రో బయాలజీ నడిపించింది!

‘‘మాది అంబేద్కర్ కోనసీమ జిల్లా, రామచంద్రాపురం. కాకినాడలోని రంగరాయ మెడికల్ కాలేజ్‌లో ఎంబీబీఎస్, అదే కాలేజ్‌లో ఎం.డీ (మైక్రో బయాలజీ) కూడా చేసి, సాంక్రమిక వ్యాధుల నిపుణుడిగా ప్రాక్టీస్ చేస్తున్నాను. మైక్రో బయాలజీలో చేరడం ఇష్టంతో కాదని చెప్పడానికి ఏ మాత్రం మొహమాట పడను. సీటు వచ్చిన కోర్సుతో రాజీపడిపోయాను. కానీ కోర్సు మొదలైన తర్వాత ఏర్పడిన ఆసక్తిని మాటల్లో వర్ణించలేను. నేరుగా వైద్యం చేయడం కంటే వైద్యరంగానికి అవసరమైన తెర వెనుక కృషి చాలా సంతృప్తినిచ్చింది. గర్భిణులు, ఇతర వ్యాధిగ్రస్థులకు పరీక్షల కోసం సేకరించిన రక్త నమూనాలను తీసుకుని ఎయిడ్స్ వైరస్ గురించి ప్రభుత్వం చాలా గోప్యంగా పరీక్షలు నిర్వహించేది. మనదేశంలో వెయ్యిలో 15 మందిలో ఎయిడ్స్ వైరస్ ఉన్నట్లు, అది దక్షిణాది ఆఫ్రికా దేశాల నుంచి మనదేశంలోకి వస్తున్నట్లు తెలుసుకున్నాం. దేశంలో ప్రభుత్వ సంస్థల దగ్గర ఉన్న సమాచారమంతటినీ సేకరించాను. అన్ని సంస్థల దగ్గరున్న సమాచారం కంటే ఎక్కువ డాటా నా దగ్గరుంది. అప్పట్లో మనదగ్గర ఎయిడ్స్‌కి వైద్యం చేసే డాక్టర్‌లు లేరు. అనుబంధ సమస్యలకు వైద్యం చేసే నిపుణులే హెచ్‌ఐవీకి కూడా మందులిచ్చేవారు. ఆ ఖాళీని భర్తీ చేయాలనుకున్నాను. రెండు తెలుగు రాష్ట్రాల్లో తొలి హెచ్ఐవీ ఫిజీషియన్‌ని నేనే.



‘హెల్త్ కేర్ ఎక్సలెన్స్ అవార్డ్ 2023’ అందుకుంటున్న డాక్టర్ మురళీకృష్ణ

వారానికి ఇద్దరు పేషెంట్‌లు!

సొంత ప్రాక్టీస్ మొదలుపెట్టింది 2000లో. మొదట్లో వారానికి ఇద్దరు లేదా ముగ్గురు పేషెంట్‌లు వచ్చేవారు. దాంతో నా సమయాన్ని ఎయిడ్స్ అధ్యయనానికి ఉపయోగించాను. ప్రముఖ పరిశోధకులందరూ శాస్త్రం ఆధారంగా ఎయిడ్స్‌కు వైద్య శోధన మొదలు పెట్టారు. నా అధ్యయనం, పరిశోధనలను పేషెంట్ వైపు నుంచి మొదలు పెట్టాను. ఎయిడ్స్‌కి మాంటూక్స్ టెస్ట్ అలాంటిదే. ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులు వ్యాధినిరోధక శక్తిని కోల్పోయి టీబీ సోకడం సర్వసాధారణంగా జరిగేది. ఎయిడ్స్ మరణాల్లో ఎక్కువ టీబీ మరణాలే ఉండేవి. ‘13వ ఇంటర్నేషనల్ ఎయిడ్స్ కాన్ఫరెన్స్’ సౌత్ ఆఫ్రికాలోని దర్బన్‌లో జరిగింది. ఆ సదస్సులో నేను ‘మాంటూక్స్ టెస్ట్’ ఎయిడ్స్ తీవ్రత పట్ల ఒక అంచనాకు రావచ్చని చెప్తూ నా పరిశోధన పత్రాన్ని సమర్పించాను. అది ఎయిడ్స్ చికిత్సలో కొత్త దృక్పథానికి దారి తీసింది. ఎయిడ్స్ చికిత్సలో వైద్యం మొదలు పెట్టిన వారం రోజుల నుంచి రికవరీ స్పష్టంగా తెలుస్తుంది. అయితే జీవితకాలం మందులు వాడాల్సిందే. పేషెంట్ తిరిగి తన పనులకు వెళ్లగలిగేటట్లు చేయడం నా వైద్యం ఉద్దేశం. ఈ వ్యాధి పేద వాళ్లలోనే ఎక్కువ. వారికి వైద్యం చేయడంలో టెస్ట్‌ల మీద ఆధారపడకుండా వ్యాధి లక్షణాలు, చిహ్నాలను బట్టి తీవ్రతను అంచనా వేసి చికిత్స చేస్తాను. అలాగే రెండంచెల ఔషధాలతో వైద్యం చేయడం కూడా నేను చేసిన మరో ప్రయోగం. ఫ్రాన్స్‌లో జరిగిన ‘ఇంటర్నేషనల్ సింపోజియమ్ హెచ్ఐవీ ఎమర్జింగ్ మెడిసిన్’ సదస్సులో పేపర్ సమర్పించాను. నేను ప్రతిపాదించిన పదేళ్ల తర్వాత 2019 నుంచి ఇప్పుడు అంతర్జాతీయంగా టూ డ్రగ్స్ చికిత్సనే అనుసరిస్తున్నారు.

కోవిడ్‌కి ఇంట్లోనే వైద్యం

కోవిడ్ వైద్యరంగానికి పెద్ద సవాల్ అనే చెప్పాలి. ఒక వ్యాధికి మందులు రావాలంటే దశాబ్దాల పరిశోధన తర్వాత మాత్రమే సాధ్యం. కొత్త వ్యాధి, పైగా ఒక్కసారిగా విజృంభించినప్పుడు రోగులందరికీ ఒకేసారి నాణ్యమైన వైద్యం అందించడం ఎవరికీ సాధ్యం కాదు. వ్యాధి విస్తరించినంత వేగంగా ప్రత్యామ్నాయాల అన్వేషణ కూడా జరగాలన్న ఆలోచనతో సులభంగా, చవగ్గా దొరికే మందులతో హోమ్‌కేర్ కిట్ రూపొందించాను. కోవిడ్ మీద అవగాహన కోసం వీడియోలు చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాను. ఒక్కో పోస్ట్ వేలసార్లు షేర్ అయింది. వైద్యం కోసం పేషెంట్‌లు అప్పుల పాలు కాకూడదనేది నా పాలసీ. అందుకోసమే నా తాపత్రయమంతా. కోవిడ్ మీద కూడా అవగాహన పుస్తకం తెచ్చాను. కోవిడ్ తర్వాత వస్తున్న సమస్యల మీద అధ్యయనం ఇంకా కొనసాగుతోంది. నాలుగు ఇంటర్నేషనల్ సెమినార్‌లలో పేపర్‌లు ప్రెజెంట్ చేశాను. ఇంకా చేస్తాను కూడా. ఒక డాక్టర్‌గా వైద్యరంగం నేర్పించిన జ్ఞానంతో పేషెంట్‌లను ఆరోగ్యవంతులను చేయడానికి కృషి చేయడం అనేది నూటికి తొంబై తొమ్మిది మంది చేసే పని. నా కృషితో వైద్యరంగానికి తోడ్పాటు అందించడం నా విజయం. మొదట ఆరోగ్యపరంగా నన్ను నేను జయించాను. ఆ తర్వాత జీవితాన్ని జయించాను. మా ఇంట్లో తొలి వైద్యుడిని నేనే. నా పిల్లలిద్దరిలో ఎవరూ వైద్యరంగం పట్ల ఆసక్తి చూపకపోవడమే మనసుకు బాధ కలిగించే విషయం’’ అన్నారు ప్రజారోగ్య పరిరక్షణలో జీవన సాఫల్య పురస్కారం అందుకున్న డాక్టర్ మురళీకృష్ణ.

ఎయిడ్స్ అవగాహన వ్యాసాలు

హెచ్ఐవీ గురించి మన సమాజంలో విపరీతమైన భయం రాజ్యమేలుతున్న రోజులవి. ఆ వ్యాధి పట్ల అవగాహన కల్పించడం కోసం నగరాలు, పట్టణాలు, చిన్న కాలనీలు, గ్రామాల్లో ఐదు వందలకు పైగా సమావేశాల్లో ప్రసంగించాను. వయోజనుల్లో అవగాహన కోసం ‘అక్షర గోదావరి’ పేరుతో క్లుప్తంగా, సరళంగా సామాన్యులకు అర్థమయ్యే రీతిలో రాశాను. మొదట మా జిల్లాలో ప్రయోగాత్మకంగా మొదలు పెట్టిన ఆ ప్రాజెక్టును తర్వాత అన్ని జిల్లాలకూ విస్తరించారు. ఆశ వర్కర్స్, రీసోర్స్ పర్సన్స్‌కి ప్రామాణిక గ్రంథంగా నా రచననే తీసుకున్నారు. హెచ్ఐవీ గురించిన అవగాహన వ్యాసాలతో ‘ఎయిడ్స్’ పేరుతో పుస్తకాన్ని ప్రచురించాను. ఆ పుస్తకం పునర్ముద్రణలతో పదేళ్లలో ఎనిమిది వేల కాపీలు అమ్ముడవుతుందని నేను కూడా ఊహించలేదు. ఎంబీబీఎస్‌లో కాలేజ్ మ్యాగజైన్‌కి ఎడిటర్‌గా పని చేసిన అనుభవమే ఇప్పటికీ నా అధ్యయనాలన్నింటినీ అక్షరబద్ధం చేయిస్తోంది.

– డాక్టర్ యనమదల మురళీకృష్ణ, ఎం.డి., కాకినాడ, ఆంధ్రప్రదేశ్

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

ఇండస్ట్రీ 4 స్టార్టప్స్‌కు ‘కల్పతరువు’ విశాఖ



- దేశంలో తొలి ఇండస్ట్రీ 4 సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ కల్పతరువు
- తొలి దశలో 5 స్టార్టప్స్ ఏర్పాటు • రెండో దశలో మరో 16 ఏర్పాటుకు రంగం సిద్ధం
- 13 సంస్థలు స్టీల్‌ప్లాంట్ సమస్యలపై పరిశోధనలు
- సాధారణ సమస్యలపై వినూత్న ఆవిష్కరణలకు సిద్ధంగా 8 స్టార్టప్‌లు
- ఆవిష్కరణలను మరిన్ని ప్రభుత్వరంగ సంస్థలకు విస్తరణ
- తాజాగా హిందుస్థాన్ షిప్‌యార్డ్‌తో ఒప్పందం
- ఎన్‌టీపీసీ, ఐవోసీఎల్ వంటి సంస్థలతో చర్చలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో స్టార్టప్‌లు యూనికార్న్ కంపెనీలు (కంపెనీ విలువ బిలియన్ డాలర్లకు చేరడం)గా ఎదగాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంకల్పానికి విశాఖ కేంద్రంగా మారుతోంది. పారిశ్రామిక రంగంలో నాలుగో తరం సాంకేతిక విప్లవంగా పేర్కొంటున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ), రోబోటిక్, ఆటోమేషన్, బిగ్ డేటా వంటి టెక్నాలజీల్లో నూతన ఆవిష్కరణలకు కేంద్ర స్థానమవుతోంది. విశాఖపట్నంలో ఏర్పాటైన దేశంలోనే మొట్టమొదటి ఇండస్ట్రీ 4 సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ ‘కల్పతరువు’లో ఈ నూతన ఆవిష్కరణలపై పలు స్టార్టప్స్ సంస్థలు జోరుగా పరిశోధనలు సాగిస్తున్నాయి.

ఇండస్ట్రీ 4 ఆవిష్కరణలను ప్రోత్సహించేలా కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ, సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ), ఆంధ్రప్రదేశ్ ఇన్నొవేషన్ సొసైటీ, రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్) సంయుక్తంగా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రాంగణంలో కల్పతరువు పేరిట సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ని రూ. 20 కోట్లతో ఏర్పాటు చేశాయి. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో వేడి ఉక్కు ద్రావణం ప్రవహించే చోట్ల, అధిక వేడి ఉండే కొలిమిల వద్ద మనుషులు పనిచేయడం చాలా కష్టం. ప్రమాదాలు జరిగే అవకాశాలూ ఎక్కువ. ఇలాంటి చోట మానవరహితంగా పూర్తి ఆటోమేటిక్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసేలా కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడమే కల్పతరువు ప్రధాన ఉద్దేశం. ఇందులో భాగంగా ఆర్ఐఎన్ఎల్ ఉక్కు తయారీలో ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటికి నూతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పరిష్కారాన్ని చూపేలా పరిశోధనలు చేయడానికి ప్రాబ్లమ్ స్టేట్‌మెంట్స్‌ను ప్రకటిస్తూ ఉంటుంది. ఇలా ఆర్ఐఎన్ఎల్ ఇచ్చిన సమస్యలపై పరిశోధన చేసి నూతన ఆవిష్కరణలను కనుక్కోవడానికి అనేక స్టార్టప్ సంస్థలు విశాఖ కల్పతరువును వేదికగా చేసుకొంటున్నాయి. తొలి దశలో అయిదు స్టార్టప్స్ పరిశోధనలు ప్రారంభించాయి. తాజాగా రెండో దశలో మరో 16 స్టార్టప్స్ ఆవిష్కరణలను ఎంపిక చేసినట్లు సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ) వైజాగ్ అడిషనల్ డైరెక్టర్ సురేష్ ‘సాక్షి’కి తెలిపారు. రెండు దశలతో కలిపి 21 స్టార్టప్‌లు ఇక్కడ ఏర్పాటవుతున్నాయి. గతంలో ఏర్పాటైన 5 స్టార్టప్‌లు, తాజా స్టార్టప్‌లలో 8 కంపెనీలు స్టీల్‌ప్లాంట్ (ఆర్ఐఎన్ఎల్) సమస్యలపై పరిశోధనలకు ఏర్పాటయ్యాయి. మిగతా 8 స్టార్టప్‌లు సాధారణ సమస్యలపై పరిశోధన చేస్తాయి. ఈ 8 సంస్థలు అందరికీ ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చేలా వినూత్నమైన ఆలోచనలతో వచ్చాయని, అందుకే వాటిని ఎంపిక చేశామని సురేష్ చెప్పారు. తాజాగా వచ్చిన 16 స్టార్టప్స్ పరిశోధనల కోసం కల్పతరువులో ఇంక్యుబేషన్ సెంటర్‌తో పాటు ల్యాబ్, ఆర్థిక సహకారం వంటి ప్రయోజనాలను కల్పిస్తారు.

మరిన్ని ప్రభుత్వ రంగ సంస్థలకు విస్తరణ

ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్ సమస్యల పరిష్కారానికే పరిమితమైన కల్పతరువును మరిన్ని ప్రభుత్వరంగ సంస్థలకు విస్తరించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. తాజాగా మరో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ హిందుస్థాన్ షిప్‌యార్డ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నామని సురేష్ చెప్పారు. త్వరలోనే షిప్‌యార్డ్ సమస్యలను నాలుగో తరం సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కరించేలా ప్రాబ్లమ్ స్టేట్‌మెంట్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపారు. విశాఖ కేంద్రంగా పనిచేస్తున్న ఎన్‌టీపీసీ, విశాఖ పోర్టు, హెచ్‌పీసీఎల్ వంటి మరికొన్ని ప్రభుత్వరంగ సంస్థలతో కూడా చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు.

మిరప.. రెపరెప

రికార్డు స్థాయిలో సాగు

- ఖరీఫ్‌లో సాధారణ విస్తీర్ణం 4.84 లక్షల ఎకరాలు
- 2022–23లో రికార్డు స్థాయిలో 5.70 లక్షల ఎకరాల్లో సాగు
- ఈ ఏడాది కనీసం 6.30 లక్షల ఎకరాలు దాటుతుందని అంచనా
- ఫలించిన సస్యరక్షణ చర్యలు.. నల్ల తామర సహా చీడపీడలు దూరం
- గతేడాది కంటే మిన్నగా దిగుబడులు వస్తాయని అంచనా



ఈ రైతు పేరు కంబాల బ్రహ్మం. పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం వెంకటాయపాలెం గ్రామానికి చెందిన ఈయన గతేడాది 2 ఎకరాల్లో మిరప సాగు చేశారు. ఈ ఏడాది బోరు కింద 4 ఎకరాల్లో మిరపను సాగు చేస్తున్నారు. ప్రభుత్వం, ఉద్యాన శాఖ అధికారుల అండదండలతో సాగు చేస్తున్నామని.. నల్ల తామర సహా చీడపీడలు, తెగుళ్ల ప్రభావం ఎక్కడా కనిపించలేదని బ్రహ్మం చెబుతున్నారు. ఈ ఏడాది దిగుబడితోపాటు గతేడాది కంటే మంచి ఆదాయం వస్తుందని ఆశిస్తున్నట్టు చెప్పారు.

సాక్షి, అమరావతి

ఈ ఏడాది మిరప పంటను రైతులు రికార్డు స్థాయిలో సాగు చేస్తున్నారు. మంచి ధర పలుకుతుండటంతో ప్రతికూల వాతావరణంలోనూ భారీ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. నల్ల తామర సహా చీడపీడలు, తెగుళ్ల ప్రభావం పెద్దగా లేకపోవడం.. గత ఏడాది కంటే మిన్నగా దిగుబడులొచ్చే అవకాశం ఉండటంతో రైతుల్లో ఉత్సాహం కనిపిస్తోంది. రాష్ట్రంలో మిరప సాధారణ విస్తీర్ణం 4.87 లక్షల ఎకరాలు కాగా.. గతేడాది రికార్డు స్థాయిలో 5.70 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ఈ ఏడాది ఇప్పటికే 6 లక్షల ఎకరాల్లో మిరప నాట్లు వేయగా.. నవంబర్ మొదటి వారం వరకు పంట వేసే అవకాశం ఉన్నందున అదనంగా కనీసం మరో 20–30 వేల ఎకరాల్లో సాగయ్యే అవకాశాలు ఉన్నాయని అంచనా వేస్తున్నారు. సీజన్ ప్రారంభంలో వర్షాభావ పరిస్థితులు ఒకింత కలవరపెట్టినప్పటికీ సెప్టెంబర్‌లో కురిసిన వర్షాలు రైతులకు ఊరటనిచ్చాయి. గతేడాది కురిసిన వర్షాలతో భూగర్భ జలాలకు లోటు లేకపోవడంతో బోర్ల కింద రికార్డు స్థాయిలో పంటలు వేశారు.

సమృద్ధిగా ఎరువులు.. ఫలిస్తున్న సస్యరక్షణ చర్యలు

సీజన్ ఆరంభం నుంచి ప్రభుత్వం అండగా నిలవడంతో ఏ దశలోనూ విత్తనం, ఎరువుల కోసం రైతులు ఇబ్బందిపడలేదు. ఆర్బీకేల్లో సమృద్ధిగా ఎరువులు అందుబాటులో ఉంచడంతో గ్రామంలోనే పొందగలుగుతున్నారు. మరోవైపు నల్ల తామరను ఎదుర్కొనేందుకు ఆర్బీకే స్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించడంతో రైతులు జాగ్రత్త పడ్డారు. ప్రస్తుతం పంట 85 శాతం ఏపుగా పెరిగే దశలో ఉండగా.. 15 శాతం పూత దశకు చేరుకుంది. ప్రభుత్వ చర్యల ఫలితంగా నల్లతామరతో సహా ఇతర చీడపీడలు, తెగుళ్ల జాడ కనిపించలేదు.



దిగుబడి.. ధరలపై ఆశలు

గతేడాది ఎకరాకు 18 నుంచి 23 క్వింటాళ్ల దిగుబడి రాగా.. ఈసారి 20–25 క్వింటాళ్లకు తగ్గదని అధికారులు చెబుతున్నారు. గతేడాది 11.50 లక్షల టన్నుల దిగుబడులు రాగా.. ఈ ఏడాది 12 లక్షల టన్నులకు పైగా వస్తుందని అంచనా వేస్తున్నారు. 2022–23లో గరిష్టంగా క్వింటాల్ ధర రూ.27 వేలు పలకగా.. ప్రస్తుతం కనిష్టం రూ.20వేలు, గరిష్టంగా రూ.29 వేలు, మోడల్ రకం రూ.24 వేల వరకు పలుకుతోంది. తొలుత మార్కెట్‌కు వచ్చే మధ్యప్రదేశ్ మిరపపై వర్షాభావ పరిస్థితులు ప్రభావం చూపడంతో మిరప ధర మరింత పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి. పంట కోతకొచ్చే సమయానికి రూ.30 వేల నుంచి రూ.32 వేలకు పైగా చేరవచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

మిరపకు ఢోకా లేదు

మిరప గతేడాది కంటే మిన్నగా సాగవుతోంది. ఇప్పటికే 6 లక్షల ఎకరాలు దాటింది. సీజన్ ముగిసే నాటికి కనీసం 6.30 లక్షల ఎకరాలు దాటే అవకాశాలు ఉన్నాయి. ఆర్బీకే స్థాయిలో చేపట్టిన సస్యరక్షణ చర్యల వల్ల నల్లతామర, చీడపీడల ప్రభావం కనిపించలేదు. ప్రస్తుతం రికార్డు స్థాయిలో పెరుగుతున్న ధరలు వల్ల రైతులకు మంచి ఆదాయం వచ్చే అవకాశాలున్నాయి.

– ఎం.వెంకటేశ్వర్లు, అడిషనల్ డైరెక్టర్, ఉద్యాన శాఖ

అలంకార అరటి.. ఆంధ్రా మేటి!

అర్నమెంటల్ బనానా సాగుకు అనువుగా గోదావరి జోన్

- ఉద్యాన వర్సిటీలో ఫలించిన పరిశోధనలు
- పుష్పగుచ్ఛాలు, గోడలపై అలంకరణల్లో వినియోగం
- వీటి ఆకులతో బయో ప్లేట్స్ తయారీ
- ఎకరాకు రూ.లక్ష వరకు ఆదాయం

సాక్షి, అమరావతి: విదేశాల్లో విశేష ప్రాచుర్యం పొందిన అలంకార అరటి (అర్నమెంటల్ బనానా) సాగుకు ఆంధ్రప్రదేశ్ అనువైనదిగా గుర్తించారు. ఈ రకం అరటిని సాగు చేసేందుకు వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిశోధకులు చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలిస్తున్నాయి. ప్రపంచ ఉద్యాన పరిశ్రమలో అలంకార అరటి రకాలు ఇటీవల కాలంలో విశేష ప్రాచుర్యం పొందుతున్నాయి. అలంకార అరటి రకాలు ఆహ్లాదం గొలిపేలా ఉంటాయి. అందమైన ఆకులు, పువ్వుల కోసం వీటిని పెంచుకుంటారు. అయితే.. ఇవి తినదగిన పండ్లను ఉత్పత్తి చేయలేవు.

6 నెలలకు రూ.లక్ష ఆదాయం

బ్రెజిల్, థాయ్‌లాండ్, మయన్మార్, చైనా దేశాలలో ఈ రకాలు విశేష ప్రాచుర్యంలో ఉన్నాయి. వీటికి ఆ దేశాల్లో మంచి డిమాండ్ కూడా ఉంది. నాలుగు మూసా జాతులను సంకరపర్చడం ద్వారా వీటిని అభివృద్ధి చేశారు. ఇవి చాలా పొట్టిగా, చిన్నగా.. చూసేందుకు అందంగా కనిపిస్తాయి. ఇంటి పెరట్లోనూ, కుండీలలోను ఈ రకాలను పెంచుకోవచ్చు. ఈ మొక్కలను కనీసం ఒకటిన్నర మీటర్ దూరంలో నాటుకోవచ్చు. నేల స్వభావాన్ని, తోటలోని అనువును బట్టి ఇంకా దగ్గరగా కూడా నాటుకోవచ్చు. వీటికి సోకే ఆకుమచ్చ, గొంగళి పురుగుల నివారణ కోసం కనీస సంరక్షణ చర్యలు చేపడితే చాలు. కుండీ మొక్కలు, ఇంటి ముంగిట, పెరటి తోటల్లో అందం కోసం నాటుకోవడానికి పిలకల్ని ఉత్పత్తి చేయడం ద్వారా మంచి ఆదాయం పొందవచ్చు. ప్రతి 6 నెలలకు ఎకరాకు రూ.లక్ష వరకు ఆదాయం పొందే అవకాశం ఉంది. వీటి ఆకులను పుష్పగుచ్ఛాల్లో విరివిగా ఉపయోగిస్తుంటారు. గోడలపై అలంకరణలకు, బయో ప్లేట్స్‌గా కూడా ఉపయోగిస్తున్నారు. విదేశాల్లో మాత్రమే సాగవుతున్న ఈ రకాల సాగుకు రాష్ట్రంలోని గోదావరి జోన్‌లోని ఉష్ణ మండల ప్రాంతం అనువైనదిగా గుర్తించారు. ఆ దిశగా రైతులను ప్రోత్సహించే దిశగా ఉద్యాన విశ్వవిద్యాలయం కృషి చేస్తోంది.



సత్ఫలితాలిచ్చాయి



గోదావరి మండలంలో ప్రధాన పండ్ల అరటిలో ఆర్నమెంటల్ అరటి జాతుల సాగుపై చేసిన పరిశోధనలు సత్ఫలితాలిచ్చాయి. తేమతో కూడిన పరిస్థితులలో వీటి సాగుపై అధ్యయనం చేశాం. మన ప్రాంత వాతావరణానికి అనువుగా, వీటి సామర్థ్యాన్ని అంచనా వేయడానికి ఈ పరిశోధన ఎంతగానో దోహదపడుతుందని గుర్తించాం.

– డి.బేబి శ్రీదివ్య, ఎమ్మెస్సీ విద్యార్థిని, వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ

సత్ఫలితాలిస్తున్న పరిశోధనలు



పీహెచ్‌డీ విద్యార్థులు చేస్తున్న పరిశోధనలు సత్ఫలితాలిస్తున్నాయి. మన ప్రాంతం వీటి సాగుకు అనువైనదిగా గుర్తించాం. రైతులకు పరిశోధనా ఫలాలు అందించేందుకు పీహెచ్‌డీ విద్యార్థులు చేస్తున్న పరిశోధనలు ఉపయోగపడుతున్నాయి.

– డాక్టర్ ఎస్.సూర్యకుమారి, డీన్ ఆఫ్ పీజీ స్టడీస్, వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited Survey No 158/1 B-3A, Kakkalapally Village, Ananthapur - 515 004. A.P., and Printed at Jagati Publications Limited Survey No 158/1 B-3A,Kakkalapally Village, Ananthapur - 515 004. A.P., Editor: V. Murali (Responsible for selection of News under the PRB Act), Phone No. 08554 248892, 248893, Fax No. 248894 RNI Regn No. APTEL/2008/23793.